www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# ప్రజా విశ్వంభర
అక్షరం సాక్షిగా...
శనివారం 9 - 8 - 2025 సంపుటి : 1 సంచిక : 34 పేజీలు : 12 వెల : 5/- తెలంగాణ/ఆంధ్రప్రదేశ్



V3 NEWS
డా॥ కాచం సత్యనారాయణ
CMD

# మూసీ పునరుజ్జీవమే ప్రత్యామ్నాయం

- హైదరాబాద్‌లో భారీ వర్షాలు పడిన తట్టుకునేలా వ్యవస్థల ప్రక్షాళన చేయాలి
- నీటి ప్రవాహనికి వీలుగా డ్రైనేజీలు,ట్రాఫిక్
- చిక్కుల్లేకుండా చర్యలు చేపట్టాలి
- చెర్వులు, కుంటలు, నాలాలు,ఎస్టీపీల ద్వారా మూసీకి అనుసంధానం చేయాలి
- తాగునీటితో పాటు డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపెట్టాలి
- మరో వందేళ్ల అవసరాలకు అంచనాతో కొత్త ప్రణాళికలు సిద్ధం చేయాలి
- ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలి
- పెడిస్ట్రియల్ జోన్ ను ఏర్పాటు చేసి పార్కింగ్ సమస్యకు చెక్ పెట్టాలి - సీఎం రేవంత్ రెడ్డి

2లో...





2వ పేజీలో...

హైకోర్టు జడ్జిపై ఆంక్షల విషయంలో..

## వెనక్కి తగ్గిన సుప్రీంకోర్టు...

ఢిల్లీ,: హైకోర్టు జడ్జిపై ఆంక్షల విషయంలో గతంలో వెలువరించిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు ఉపసంహరించు కుంది. అలహాబాద్ హైకోర్టుకు చెందిన ఓ న్యాయమూర్తి రిటైరయ్యేంతవరకూ ఆయనకు క్రిమినల్ కేసులు అప్పగిం చకూడదని ఆంక్షలు విధిస్తూ ఈనెల 4న వెలువరించిన ఉత్తర్వులను ఉప సంహరించుకుంటున్నట్లు పేర్కొంది.



2వ పేజీలో...

అప్పటివరకూ భారత్‌తో

## చర్చలు ఉండవు

ట్రంప్ మరో సంచలన ప్రకటన

వాషింగ్టన్: భారీ సుంకాలతో భారత్‌పై అన్యాయంగా కాలుదువ్వుతున్న ట్రంప్ తాజాగా మరో బాంబు పేల్చారు. భారత్‌తో వాణిజ్య చర్చలు ఉండవని స్పష్టం చేశారు. దీంతో, భారత్–అమెరికా సంబంధాలు మునుపెన్నడూ చూడని స్థాయిలో పతనమై ఆందోళన రేకెత్తిస్తున్నాయి. భారత్‌పై సుంకాల విధింపు అనంతరం చర్చలు కొనసాగుతాయా? అన్న మీడియా ప్రశ్నకు ట్రంప్ ఉండవని తెలిపారు. 'విషయం కొలిక్కి వచ్చేంత వరకూ చర్చలు ఉండవు' అని స్పష్టం చేశారు. అంతకుముందు కూడా భారత్‌పై ట్రంప్ రెచ్చిపోయారు. రష్యాతో వాణిజ్యం నెరపే దేశాలపై మరిన్ని సుంకాలు ఉంటాయని హెచ్చరించారు. ఇతర దేశాలూ రష్యాతో వాణిజ్యం జరుపుతుండగా భారత్‌పైనే అక్కసు ఎందుకని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ట్రంప్ ఈ మేరకు సమాధానం ఇచ్చారు. భారతీయ ఉత్పత్తులపై అమెరికా ఇప్పటికే 25 శాతం సుంకం విధిస్తోంది. అదనంగా మరో 25 శాతం సుంకం విధిస్తూ ట్రంప్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. కొత్త సుంకాలు ఆగస్టు 27 నుంచి అమల్లోకి రానున్నాయి.



ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1 వరకు

చైనా పర్యటనకు

## మోడీ..

న్యూఢిల్లీ, : భారత్ మంచితనాన్ని ఆసరాగా చేసుకుని పన్నుల పేరుతో బెదిరిస్తున్న ట్రంప్‌కు షాకిచ్చిందేకు ప్రధాని మోదీ రెడీ అయ్యారు. ఇప్పటికే రష్యాతో స్నేహం వదులుకునేది లేదని ఇండియా స్పష్టం చేసింది. ఇప్పుడు చైనాతోనూ సన్నిహితమవుతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎస్‌సీఓ సమ్మిట్ కోసం చైనాకు వెళ్లనున్నారు. గల్వాన్ ఘర్షణ తర్వాత మొదటి సారి భారత ప్రధానమంత్రి బీజింగ్ యాత్రకు వెళ్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1, 2025 వరకు చైనాలోని టియాంజిన్‌లో జరిగే షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సమ్మిట్‌లో పాల్గొనేందుకు చైనా సందర్శించనున్నారు.

2వ పేజీలో...



భారత్ వ్యూహాత్మక

## అడుగులు

రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో అజిత్ ధోవల్ భేటీ

తాజా పరిణామాలపై ఇరు నేతలుచర్చ

2వ పేజీలో...

మాస్కో, : గత కొన్ని రోజులుగా భారత్, రష్యా, అమెరికా మధ్య ఆసక్తికరమైన పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. రష్యాతో భారత్ తన స్నేహాన్ని మరింత బలోపేతం చేసుకుంటోంది. ఇదే సమయంలో అమెరికా నుంచి వస్తున్న ఒత్తిడిని కూడా ఎదుర్కొంటోంది.



2వ పేజీలో...

ట్రంప్‌తో ఎలా వ్యవహరించాలో

## నరేంద్రమోదీకి చెబుతా

ఇజ్రాయెల్ ప్రధాని

ఢిల్లీ,: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో ఎలా వ్యవహరించా లనే అంశంపై తాను భారత ప్రధాని నరేంద్ర మోదీకి కొన్ని సలహాలు ఇస్తానని ఇజ్రాయెల్ ప్రధాని బెంజామిన్ నెతన్యాహు చెప్పారు. నరేంద్ర మోదీ, డొనాల్డ్ ట్రంప్ ఇద్దరూ తనకు అత్యంత సన్నిహితులని, కాబట్టి తాను వారికి సాయపడగలనని ఆయన సూచనప్రాయంగా తెలిపారు. ఇజ్రాయెల్‌లో పర్యటిస్తున్న భారత జర్నలిస్టుల బృందంతో



హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కొడంగల్ నుంచి వచ్చిన గిరిజన సోదరీమణులు రాఖీ కట్టి తమ కృతజ్ఞతను చాటుకున్నారు. ప్రభుత్వం తమ జీవితాలను, జీవనాధారమైన వ్యవసాయ భూములను లాక్కున్నప్పుడు, తమకు ఒక అన్నలా అండగా నిలిచిన కేటీఆర్‌కు రాఖీ కట్టామని వారు తెలిపారు. కొడంగల్ మండలం లగచర్ల గ్రామం రోటిబండ తండాకు చెందిన జ్యోతి, మరికొంతమంది మహిళలు కేటీఆర్ నివాసానికి వెళ్లి రాఖీ కట్టారు.

కేటీఆర్‌కు రాఖీ కట్టిన

## లగచర్ల ఆడబిడ్డ జ్యోతి

2వ పేజీలో...

ప్రజా విశ్వంభర

# మూసీ పునరుజ్జీవమే ప్రత్యామ్నాయం

## హైదరాబాద్‌లో భారీ వర్షాలు పడిన తట్టుకునేలా వ్యవస్థల ప్రక్షాళన చేయాలి

## పెడిస్ట్రియల్ జోన్ ను ఏర్పాటు చేసి పార్కింగ్ సమస్యకు చెక్ పెట్టాలి - సీఎం రేవంత్ రెడ్డి



**మొదటిపేజీ తరువాయి...**

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:**
హైదరాబాద్ మహా నగరంలో భారీ వర్షాలు కురిసినా తట్టుకునేందుకు వీలుగా వ్యవస్థలన్నింటినీ ప్రక్షాళన చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. వరద నీటి ప్రవాహానికి ఉన్న అడ్డంకులను అధిగమించటంతో పాటు భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే అభివృద్ధికి వీలుగా పనులు చేపట్టాలని ఆదేశించారు. వర్షాలతో నగరం అతలాకుతలం కాకుండా ఉండేందుకు, జనజీవనం అస్తవ్యస్తం కాకుండా ఉండాలంటే.. అత్యవసరంగానే శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరముందని ముఖ్యమంత్రి అధికారులను అప్రమత్తం చేశారు. తాగునీరు, వరద నీరు, డ్రైనేజీలు, ట్రాఫిక్ వ్యవస్థలను మరో వందేళ్ల భవిష్యత్తు అవసరాలను అంచనా వేసుకొని కొత్త ప్రణాళిక సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు.

ఢిల్లీ నుంచి శుక్రవారం మధ్యాహ్నం హైదరాబాద్ కు చేరుకున్న ముఖ్యమంత్రి గురువారం రాత్రి హైదరాబాద్ లో కురిసిన వర్షం, తలెత్తిన ఇబ్బందులు, అధిగమించేందుకు అనుసరించాల్సిన తక్షణ చర్యలపై అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. అన్ని విభాగాల అధికారుల అభిప్రాయాలను తీసుకున్నారు. హైదరాబాద్ లోనిన్న రాత్రి అత్యధికంగా 15 సెంటీమీటర్ల వర్షం కురిసింది. దీంతో ట్రాఫిక్ స్తంభించటంతో పాటు లోతట్టు ప్రాంతాల్లో వరద నీటితో ముంపు పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి.

భారీ వర్షం ఒకేసారి కురవటంతో విపత్కర పరిస్థితులు తలెత్తుతున్నాయి. తక్కువ వ్యవధిలో ఎక్కువ వర్షం పడటంతో జనజీవనం అస్తవ్యస్తమవుతోంది. సాధారణంగా మూడు నాలుగు నెలల్లో కురిసే వర్షపాతం మొత్తం ఒకే రోజున కుమ్మరించటంతో నగరం అతలాకుతలమవుతోందని సమావేశంలో చర్చకు వచ్చింది. వాతావరణ మార్పులే అందుకు ప్రధాన కారణమని, అందుకు తగినట్లుగా నగరంలో అన్ని వ్యవస్థలను ఆధునీకరించాల్సిన అవసరముందని సీఎం అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ లో ఇప్పుడున్న రోడ్లు, డ్రైనేజీలు అయిదు సెంటీమీటర్ల వర్షం పడితే తట్టుకునే పరిస్థితి లేదని, ఒక్కోసారి 20 సెంటీమీటర్ల వర్షం నమోదవుతోందని అన్నారు.

హైదరాబాద్లో నిన్న రాత్రి కేవలం నాలుగు గంటల వ్యవధిలోనే కొన్ని ప్రాంతాల్లో 15 సెంటీమీటర్ల వర్షపాతం కురిసింది. జూన్ నుంచి ఇప్పటివరకు జీహెచ్ఎంసీ పరిధిలో సాధారణంతో పోలిస్తే 16 శాతం వర్షపాతం ఎక్కువగా నమోదైంది. అందుకే వాతావరణ మార్పులు, భారీ వర్షాలతో తలెత్తే ఈ విపత్కర పరిస్థితులను అధిగమించేందుకు విపత్తుల నివారణ నిర్వహణ ప్రణాళిక సమర్థవంతంగా అనుసరించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు.

ఎంత వర్షం పడినా గ్రేటర్ హైదరాబాద్ సిటీలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా, వరద నీటితో ముంపు గురవకుండా, లోతట్టు ప్రాంతాల ప్రజలు కూడా సురక్షితంగా ఉండేలా అత్యంత పకడ్బందీ విధానాన్ని అమలు చేయాలని, అందుకు వీలుగా రూపొందిస్తున్న మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును వెంటనే చేపట్టాలని సీఎం ఆదేశించారు. హైదరాబాద్ లో 55 కిలోమీటర్ల పొడవునా మూసీని పునరుద్ధరించటం ద్వారా పరివాహక ప్రాంతంతో పాటు నగరంలో ఉన్న అన్ని ప్రాంతాలు, కాలనీలన్నీ సురక్షితంగా ఉండటంతో పాటు లోతట్టు ప్రాంతాలు వరద ముంపునకు గురవకుండా ఉంటాయన్నారు.

వరదనీటి ప్రవాహానికి అడ్డంకులు ఉన్నందునే నగరంలో ఈ దుస్థితి తలెత్తుతోందని అధికారులు అభిప్రాయపడ్డారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్ లోని వరదనీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా నగరంలోని అన్ని వైపుల నుంచి వరద నీరు మూసీకి చేరేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

నగరంలో ఉన్న హుస్సేన్ సాగర్, దుర్గం చెర్వు, మీర్ అలం చెర్వులతో పాటు ప్రతీ చెరువు, కుంటలను నాలాల ద్వారా మూసీకి అనుసంధానం చేయాలని సూచించారు. చెరువుల పునరుద్ధరణ, నాలాలను వెడల్పు ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. డ్రైనేజీల ద్వారా వచ్చే నీటిని ఎస్టీపీ (సీవరేజీ ట్రీట్మెంట్ ప్లాంట్ల) ద్వారా శుద్ధి చేసి మూసీలో స్వచ్ఛమైన నీటి ప్రవాహం ఉండేందుకు వీలుగా అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు.

నగరంలో ఎక్కడ వర్షం పడినా నీరు చెరువుల్లోకి, నాలాల్లోకి, అటునుంచి మూసీలోకి చేరేలా అనుసంధానం జరగాలన్నారు. మూసీలో స్వచ్ఛమైన నీటి ప్రవాహంతో హైదరాబాద్ లో నీటి కష్టాలు తీరుతాయని సీఎం అన్నారు. కలుషితమైన నీటితో మూసీ పరివాహక ప్రాంతంలో రైతులు పంటలు పండిస్తున్నారని, ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. ఇకపై ఈ పరిస్థితి తలెత్తకుండా మూసీలో నిరంతరం శుద్ధి చేసిన నీటి ప్రవాహం ఉండేలా శాశ్వత ప్రణాళికలు ఉండాలని సీఎం సూచించారు. శుద్ధి చేసిన నీటిని పరిశ్రమలు, ఇతర అవసరాలకు వాటర్ ట్యాంకర్ల ద్వారా వినియోగించుకునే వీలుంటుందని అన్నారు. భవిష్యత్ లో వందేళ్ల పాటు మహానగరంలో వరద నీటి సమస్య పునరావృతం కాకుండా ఉండాలంటే మూసీ పునరుజ్జీవనమే అవసరమని సీఎం అభిప్రాయపడ్డారు. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును వరద నీటి నిర్వహణకు వీలుగా డిజైన్ చేయాలని, ఆ దిశగా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వర్షాలు, వరదల సమయంలో ట్రాఫిక్ సమస్య తీవ్రత మరింత పెరుగుతుండటంతో శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పాతనగరంలో

ఈ సమస్యను పరిష్కరించే ందుకు పెడిస్ట్రియల్ జోన్ ను ఏర్పాటు చేసి పార్కింగ్ సమస్యకు చెక్ పెట్టాలని సీఎం సూచించారు. చార్మినార్, సాలార్ జంగ్ మ్యూజియం, హైకోర్టు,ఉస్మానియా ఆసుపత్రి ప్రాంతాల్లో మల్టీ లెవెల్ పార్కింగ్ జోన్ లను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మల్టీ లెవెల్ పార్కింగ్ జోన్ ల ఏర్పాటుతో రోడ్లపై వాహనాల రద్దీని తగ్గించడంతో పాటు పార్కింగ్ సమస్యకు పరిష్కారం లభిస్తుందని సీఎం అభిప్రాయపడ్డారు. అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, హెచ్ఎండీఏ పరిధిలోని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ సెక్రటరీ ఇలంబర్తి, ఎంఆర్డీసీఎల్ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి, జేఎండీ గౌతమి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌కు రాఖీ కట్టిన లగచర్ల ఆడబిడ్డ జ్యోతి



లగచర్ల భూ పోరాటం సమయంలో నిండు గర్భిణిగా ఉన్న జ్యోతిపై రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, పోలీసులు దౌర్జన్యం చేశారని, ఆమె భర్తను జైలుకు పంపిన, సమయంలో కేటీఆర్ ఢిల్లీ వెళ్లి పలు కమిషన్లకు ఫిర్యాదులు చేసి, జ్యోతితో పాటు లగచర్ల గిరిజనులకు, పేద రైతన్నలకు జరుగుతున్న అన్యాయాన్ని ఢిల్లీ వేదికగా ఎండగట్టారు. దీని ఫలితంగా, ప్రభుత్వం భూసేకరణను వెనక్కి తీసుకుందని వారు తెలిపారు. కేసుల కారణంగా జైలుపాలైన లగచర్ల

**మొదటిపేజీ తరువాయి...**

సోదర సోదరీమణు లందరికీ కేటీఆర్ అన్నగా అండగా నిలబడి, న్యాయ సహాయం అందించారని, అందరినీ జైలు నుంచి విడిపించారని వారు తెలియజేశారు. రాఖీ కట్టిన సందర్భంగా జ్యోతి తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. 'ప్రభుత్వం మా భూములు లాక్కొని అన్ని వైపుల నుంచి దాడులు చేసి, మా కుటుంబ సభ్యులను జైల్లో పెడితే,నిండు గర్భిణిగా ఉన్న నాకు కేటీఆర్ అన్న అండగా నిలబడ్డారు. దగ్గరుండి నా బాగోగులు చూసుకున్నారు. నా ఆరోగ్యంతో పాటు నా ప్రసవం వరకు, నా బిడ్డ 'భూమి నాయక్' యోగక్షేమాల కోసం ఒక సొంత సోదరుడిలా అన్ని బాధ్యతలు తీసుకున్నారు' అని జ్యోతి కన్నీళ్లు పెట్టుకున్నారు. కేటీఆర్ మేనమామలా తన బిడ్డకు పేరు పెట్టారని జ్యోతి సంతోషం వ్యక్తం చేశారు. కేటీఆర్ తనకు దేవుడు ఇచ్చిన సోదరుడని ఆమె అన్నారు. కేవలం తమకు మాత్రమే కాకుండా, రాష్ట్రంలో ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ ఆయన అన్నలా ఆదుకుంటారని, అలాంటి కేటీఆర్‌కు, ఈరోజు ఆయన ఇంటికి వచ్చి రాఖీ కట్టడం తమకు చాలా సంతోషంగా ఉందని జ్యోతి తెలిపింది.

# హైకోర్టు జడ్జిపై ఆంక్షల విషయంలో వెనక్కి తగ్గిన సుప్రీంకోర్టు

**మొదటిపేజీ తరువాయి...**

సంబంధిత న్యాయమూర్తికి ఇబ్బందులు కలిగించడం తమ ఉద్దేశం కాదని.. అయితే కొన్ని విషయాల్లో పరిమితులు దాటినప్పుడు న్యాయవ్యవస్థ గౌరవాన్ని కాపాడటమే కోర్టు పనిచేస్తుందని జస్టిస్ పార్దివాలా పేర్కొన్నారు. అంతకుముందు ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకున్నప్పటికీ అలహాబాద్ హైకోర్టు తీర్పు చట్టవిరుద్ధమని ఆందోళన వ్యక్తంచేశారు. న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే ఇటువంటి ఆదేశాలను విస్మరించలేమని స్పష్టం చేశారు.ఒక సివిల్ వివాదంలో క్రిమినల్ చర్యలకు అనుమతినిస్తూ అలహాబాద్ హైకోర్టు కు చెందిన ఓ న్యాయమూర్తి ఇటీవల జారీచేసిన ఆదేశాలకు సంబంధించిన కేసులో రిటైరయ్యేంత వరకూ ఆయనకు ఎలాంటి క్రిమినల్ కేసులు అప్పగించవద్దని ఈనెల 4న సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు ఆదేశంలోని కొన్ని అంశాలు అమలుకాకుండా నిరోధించేందుకు ఫుల్ కోర్టును సమావేశపరచాలని అలహాబాద్ హైకోర్టుకు చెందిన 13 మంది న్యాయమూర్తులు గురువారం అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఒక లేఖ రాశారు. హైకోర్టులపై పాలనాపరమైన పర్యవేక్షణ అధికారం సుప్రీంకోర్టుకు లేదని, అందుకే ఆగస్టు 4నాటి సుప్రీం ఆదేశాల్లో 24వ, 26వ పేరాల్లోని నిర్దేశాలను అమలుచేయరాదని ఫుల్‌కోర్టు తీర్మానించాలని జడ్జీలు కోరారు. ఈ నేపథ్యంలో 'సుప్రీం' తన ఉత్తర్వులను వెనక్కి తీసుకుంది.

# అప్పటివరకూ భారత్‌తో చర్చలు ఉండవు..

**మొదటిపేజీ తరువాయి...**

దీంతో, భారత్‌పై మొత్తం సుంకం 50 శాతానికి చేరుకుంది. అమెరికా చర్యలను భారత్ ఖండించింది. సుంకాల విధింపు అన్యాయం, నిర్హేతుకం, చట్టపరంగా సమర్థనీయం కాదని తేల్చి చెప్పింది. జాతీయ ప్రయోజనాల పరిరక్షణకు తాము అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. 'ఈ విషయంలో మా వైఖరిని ముందే స్పష్టం చేశాం. మా దిగుమతులన్నీ మార్కెట్ పరిస్థితులు, 1.4 బిలియన్‌ల భారతీయులకు ఇంధన భద్రత అందించడంపై ఆధారపడి ఉంటాయి' అని విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. అమెరికా సుంకాలపై ప్రధాని మోదీ కూడా ఘాటుగా స్పందించారు. గురువారం ఎమ్ఎస్ స్వామినాథన్ సెంటెనరీ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో ప్రసంగించిన ప్రధాని.. దేశ ప్రయోజనాల కోసం తాను వ్యక్తిగతంగా ఎంతటి మూల్యం చెల్లించుకునేందుకైనా సిద్ధమేనని అన్నారు. ప్రభుత్వానికి దేశ ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేశారు. రైతులు, మత్స్యకారులు, డెయిరీ రంగం విషయంలో భారత్ రాజీ పడదని స్పష్టం చేశారు. అమెరికా అనుసరిస్తున్న ద్వంద్వ ప్రమాణాలను కూడా భారత్ ఎండగట్టింది. రష్యా చమురును కొనుగోలు చేస్తున్న చైనా, టర్కీపై సుంకాలు ఎందుకు విధించట్లేదని ప్రశ్నించింది. ఇక చైనా ఉత్పత్తులపై గతంలో ప్రకటించిన 145 శాతం సుంకాలను అమెరికా ఇప్పటికీ అమలు చేయని విషయాన్ని కూడా భారత్ ప్రస్తావించింది.

# చైనా పర్యటనకు మోడీ



ఇది 2020 జూన్‌లో గల్వాన్ లోయలో భారత , చైనా సైనికుల మధ్య జరిగిన హింసాత్మక ఘర్షణ తర్వాత మొదటి పర్యటన. ఈ ఘర్షణలో 20 మంది భారత సైనికులు , కనీసం నలుగురు చైనా సైనికులు మరణించారు, దీని తర్వాత భారత్-చైనా సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. మోదీ పర్యటన ఈ సందర్భన రెండు దేశాల మధ్య సంబంధాలలో మెరుగుదలకు సూచన అనుకోవచ్చు. 2020 జూన్ 15న లడఖ్‌లోని గల్వాన్ లోయలో లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్ (ఎల్ఏసీ) వెంబడి భారత, చైనా సైనికుల మధ్య జరిగిన ఘర్షణ 45 సంవత్సరాలలో రెండు దేశాల మధ్య మొదటి తీవ్ర ఉద్రిక్త ఘటనగా నిలిచింది. ఈ ఘర్షణలో భారత్ 20 మంది సైనికులను కోల్పోగా, చైనా అధికారికంగా నలుగురు సైనికుల మరణాన్ని ధృవీకరించింది. ఈ సంఘటన ద్వైపాక్షిక సంబంధాలను చారిత్రక కనిష్ఠ స్థాయికి దిగజార్చింది, దీని ఫలితంగా భారత్ చైనా యాప్‌లపై నిషేధం, పెట్టుబడులపై కఠిన నియంత్రణలు, రెండు దేశాల మధ్య నేరుగా విమాన సర్వీసుల రద్దు వంటి చర్యలు తీసుకుంది. ఈ ఘర్షణ తర్వాత, రెండు దేశాలు ఎల్ఏసీ వెంబడి ఉద్రిక్తతలను తగ్గించేందుకు పలు దఫాల సైనిక, దౌత్యపరమైన చర్చలు జరిపాయి. 2024 అక్టోబర్‌లో రష్యాలో జరిగిన బ్రిక్స్ సమ్మిట్‌లో ప్రధానమంత్రి మోదీ, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్

**మొదటిపేజీ తరువాయి...**

మధ్య జరిగిన సంక్షిప్త సమావేశం ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరచడానికి అవకాశంగా మారిందది. ఈ సమావేశంలో, ఎల్ఏసీ వెంబడి మిగిలిన ఉద్రిక్తతలను పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రతినిధుల (ఎస్ఆర్) సంభాషణలను పునఃప్రారంభించాలని నిర్ణయించారు. ఎస్‌సీఓ సమ్మిట్, భారత్, చైనా, రష్యా, పాకిస్తాన్, ఇరాన్, ఇతర సభ్య దేశాల నాయకులను ఒక వేదికపై తీసుకొస్తుంది, ఇది ఉగ్రవాదం, వాణిజ్యం, కనెక్టివిటీ, ప్రాంతీయ భద్రత వంటి అంశాలపై సహకారాన్ని ప్రోత్సహిస్తుంది. మోదీ ఈ సమ్మిట్‌లో పాల్గొనడం ద్వారా, ఉగ్రవాదంపై భారత్ గట్టి వైఖరిని, ముఖ్యంగా సరిహద్దు దాటిన ఉగ్రవాదంపై దృష్టి సారించనున్నారు. ఈ సమ్మిట్‌లో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వంటి నాయకులతో మోదీ ఒకే వేదికను పంచుకోనున్నారు. నాఅూ సమ్మిట్‌లో మోదీ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో కూడా షేక్ హ్యాండ్ చేయనున్నారు. అమెరికా ఎన్ని ఆంక్షలు పెట్టినా భారత్ వెనక్కు తగ్గడం లేదు. 25 శాతం టారిఫ్‌తో పాటు రష్యా నుంచి ఆయిల్ కొంటే పెనాల్టీ వేస్తామని ట్రంప్ హెచ్చరించారు.. అయినా భారత్ వెనక్కు తగ్గలేదు.

రష్యాతో చమురు మైత్రి దశాబ్దాల నుంచీ కొనసాగుతోందని.. దానిని వదులుకోబోమని చెప్పింది. ఇప్పుడు షాంఘైలో మరోసారి పుతిన్‌ను కలిసి అమెరికాకు స్పష్టమైన సందేశం ఇవ్వాలని భారత్ అనుకుంటోంది.భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ జూలై 13-15, 2025లో చైనా సందర్శించి, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ, ఉపాధ్యక్షుడు హాన్ జెంగ్‌లతో సమావేశమై, ఎస్‌సీఓ సమ్మిట్‌కు మార్గం సుగమం చేశారు. జైశంకర్ ఈ సందర్భనలో, 2024 అక్టోబర్‌లో మోదీ-జీ సమావేశం తర్వాత ద్వైపాక్షిక సంబంధాలలో కనిపిస్తున్న మెరుగుదలను కొనసాగించాలని, కైలాస్ మానససరోవర యాత్ర పునఃప్రారంభం వంటి సానుకూల చర్యలను స్వాగతించారు

# భారత్ వ్యూహాత్మక అడుగులు

**మొదటిపేజీ తరువాయి...**

ఈ సమావేశంలో భారత్-రష్యా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలపడింది. ఒక రోజు ముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత్ నుంచి వచ్చే ఉత్పత్తులపై 25 శాతం అదనపు సుంకం విధిస్తూ ఆదేశాలు జారీ చేసిన తర్వాత ఈ మీటింగ్ జరిగింది. దీంతో భారత్ ఉత్పత్తులపై మొత్తం సుంకం 50 శాతానికి చేరింది. ఎందుకంటే, రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడం. ఈ సుంకాల విషయంలో అమెరికా ఒక షరతు కూడా పెట్టింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇప్పుడు నాలుగో ఏడాదిలోకి అడుగుపెడుతోంది. ఈ యుద్ధాన్ని శుక్రవారం నాటికి రష్యా ఆపకపోతే రష్యా చమురు కొనే దేశాలపై ఆంక్షలు డబుల్ చేస్తామని అమెరికా హెచ్చరించింది. ఈ కొత్త సుంకాలు రెండు దశల్లో అమల్లోకి వస్తాయి. మొదటి 25 శాతం ఆగస్టు 7 నుంచి, మరో 25 శాతం 21 రోజుల తర్వాత. అయితే, చర్చల ద్వారా ఏదైనా మార్పు వస్తే మాత్రం ఈ పరిస్థితి మారే అవకాశం ఉంది. అమెరికా ఈ నిర్ణయంతో భారత్-అమెరికా మధ్య ఉద్రిక్తత మరింత పెరిగింది. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్, ఈ సుంకాలను అన్యాయం, ఆమోదయోగ్యం కాదని విమర్శించారు. భారత ఆర్థిక స్వాతంత్రాన్ని కాపాడటానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇదిలా ఉంటే, అమెరికా కూడా రష్యా నుంచి యురేనియం, పల్లాడియం, ఎరువులు దిగుమతి చేసుకుంటు-ందని, దీన్ని డబుల్ స్టాండర్డ్స్ అనకూడదా? అని విమర్శించారు.మరోవైపు అజిత్ దోవల్, రష్యా సెక్యూరిటీ- కౌన్సిల్ సెక్రటరీ సెర్గీ షోయిగుతో సమావేశంలో పుతిన్ ఈ ఏడాది భారత్‌కు రానున్నారని, తేదీ త్వరలో ఖరారు అవుతుందన్నారు. ఈ సందర్భన గురించి భారత్ చాలా ఉత్సాహంగా ఉందని, గతంలో జరిగిన భారత్-రష్యా సమావేశాలు రెండు దేశాల సంబంధాల్లో కీలకమైనవని దోవల్ అన్నారు. 2022లో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలైన తర్వాత పుతిన్ భారత్‌కు రావడం ఇదే మొదటిసారి కావడం విశేషం.

# అభ్యంతరాలు చెప్పడానికి ఆలస్యమెందుకు?

## రాహుల్‌కు ఈసీ ప్రశ్న

విశ్వంభర, నేషనల్ బ్యూరో: బీజేపీ, ఎన్నికల సంఘం కలిసి ఎన్నికల్లో 'భారీ నేరపూరిత మోసానికి' పాల్పడ్డాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న సంచలన ఆరోపణలపై ఎలక్షన్ కమిషన్ ఆగ్రహం వ్యక్తంచేసింది. బిహార్‌లో 65 లక్షల ఓట్లను తొలగిస్తున్నామని తాము ఆగస్టు 1న ప్రకటన విడుదల చేసినా.. మార్పులు చేర్పులపై ఇప్పటివరకు ఏ పార్టీ తమను సంప్రదించలేదని ఈసీ స్పష్టం చేసింది. ఓట్ల తొలగింపుపై విమర్శలు చేస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సైతం ముసాయిదాపై ఇంతవరకు ఎటువంటి అభ్యంతరాలు నమోదు చేయలేదని పేర్కొంది. అభ్యంతరాలు చెప్పడానికి ఆయన ఎందుకింత ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించింది. తాము విడుదల చేసిన ఓట్ల తొలగింపు ముసాయిదాపై తన అభ్యంతరాలను రాహుల్ గాంధీ ఇప్పుడు కాకుండా ఎప్పటిలాగే బిహార్ ఎన్నికలు పూర్తయ్యాక మాత్రమే ఇస్తారేమోనని ఈసీ వ్యంగ్యాస్త్రాలు విసిరింది. ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, హరియాణా, కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల సమయంలో జరిగిన ఓట్ల చోరీ గురించి రాహుల్ గాంధీ ఎన్నికల సంఘాన్ని హెచ్చరించిన అనంతరం ఈసీ ఈ వ్యాఖ్యలు చేసింది.

రాహుల్ వాదనలు తప్పని 'ఈసీ'కెలా తెలుసు?: ప్రియాంక గాంధీ..

ఎన్నికల రిగ్గింగ్‌కు సంబంధించి రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలకు తగిన ఆధారాలు సమర్పించాలని ఎన్నికల కమిషన్ (%జుజ%) రాహుల్‌ను సవాల్ చేయడంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ ఆగ్రహం వ్యక్తంచేశారు. మహారాష్ట్ర, హరియాణా మొదలైన ప్రాంతాల్లో ఎన్నికల సమయంలో అవకతవకలు జరిగినట్లు పేర్కొన్న వెంటనే ఈసీ ఆ విషయంలో దర్యాప్తు చేయడం మానేసి.. రాహుల్‌గాంధీ తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని దబాయిస్తోందన్నారు. అసలు దర్యాప్తే చేయనప్పుడు ఆయన వాదనలు తప్పని ఎన్నికల కమిషన్‌కు ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు.




తాము సమర్పించిన ఆధారాలు ఈసీ ముందే ఉన్నాయని.. వాటిని పరిణగణలోకి తీసుకొని దర్యాప్తు చేయాలని సూచించారు. తాము ఆందోళన వ్యక్తంచేస్తోంది కేవలం ఒక పార్టీ గురించి మాత్రమే కాదని.. దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థ గురించని ఆమె పేర్కొన్నారు.

ఒకటికి రెండు సార్లు ఆలోచించుకోండి:

రాహుల్ గాంధీ..రాజ్యాంగ విలువలను అపహాస్యం చేసేటప్పుడు, రాజ్యాంగంపై దాడి చేసేటప్పుడు ఎన్నికల అధికారులు ఒకటికి రెండు సార్లు ఆలోచించుకోవాలని రాహుల్ గాంధీ హెచ్చరించారు. ఎన్నికల్లో అవకతవకలకు పాల్పడిన వారిని పట్టుకోవడానికి ఎక్కువ సమయం పట్టినా.. ఎప్పటికైనా తప్పనిసరిగా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. తాను చేస్తున్న ఆరోపణలపై ప్రమాణం చేయాలని ఈసీ చేస్తున్న డిమాండ్‌ను తిప్పికొట్టారు. తాను ఇప్పటికే ఎంపీగా పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగంపై ప్రమాణం చేశానన్నారు.

# 'హిందీ' పాలసీకి స్టాలిన్ కౌంటర్..

## సొంతంగా విద్యా విధానం



విశ్వంభర, చెన్నై: కేంద్ర ప్రభుత్వం, తమిళనాడు మధ్య హిందీ వివాదం కొనసాగుతోన్న వేళ ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుక్రవారం తమ ప్రజల కోసం సొంతంగా రాష్ట్ర విద్యా విధానాన్ని (ఎస్‌ఈపీ)ని ఆవిష్కరించారు. కేంద్రం తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానానికి (ఎన్‌ఈపీ)కి కౌంటర్‌గా ఆయన ఈ నూతన విద్యావిధానాన్ని ప్రవేశపెట్టబోతున్నారు. చెన్నైలోని అన్నా సెంటినరీ లైబ్రరీ ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో స్టాలిన్ ఈ రాష్ట్ర విద్యా విధానాన్ని ఆవిష్కరించారు. కేంద్రం చెబుతోన్న త్రిభాషా సూత్రాన్ని తోసిపుచ్చుతూ ద్విభాషా అజెండాతో దీన్ని రూపొందించారు. ఈ ముసాయిదా పాలసీని రూపొందించేందుకు 2022లో విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ మురుగేశన్ నేతృత్వంలో 14 మంది సభ్యుల కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ గతేడాది తమ ప్రతిపాదనలను సీఎంకు అందించింది. దాన్ని పరిశీలించిన స్టాలిన్ సర్కారు తాజాగా నూతన విద్యా విధానాన్ని ఆవిష్కరించింది. మాతృభాషతో పాటు ఆంగ్లం, కృత్రిమ మేధ, సైన్స్ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చేలా ఈ స్టేట్ ఎడ్యుకేషన్ పాలసీని రూపొందించారు. అంతేకాదు.. నీట్ లాంటి ప్రవేశ పరీక్షలను తమిళనాడు (Tamil Nadu News) ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే కొత్త విద్యా విధానంలో ప్రవేశపరీక్షకు బదులుగా మార్కుల ఆధారంగా ప్రవేశాలు ఇవ్వాలని నిర్ణయించారు. 11, 12వ తరగతుల మార్కుల ఆధారంగా ఆర్ట్స్, సైన్స్ వంటి కోర్సుల్లో యూజీ ప్రవేశాలు కల్పించేలా కొత్త పాలసీలో ప్రతిపాదనలు చేశారు. త్రిభాషా సూత్రాన్ని తప్పనిసరి చేసే జాతీయ విద్యావిధానం అమలు విషయంలో కొంతకాలంగా కేంద్రం, తమిళనాడుల మధ్య వివాదం కొనసాగుతోంది. హిందీ భాషను తమపై బలవంతంగా రుద్దాలని కేంద్రం ప్రయత్నిస్తోందని స్టాలిన్ సర్కారు ఆరోపిస్తోంది. జాతీయ విద్యావిధానాన్ని అమలుచేయడం లేదన్న కారణంతో సమగ్ర శిక్ష పథకం కింద రాష్ట్రానికి అందాల్సిన రూ.2,152 కోట్ల నిధులను కేంద్రం మంజూరుచేయడం లేదని ఆరోపణలు చేసింది.

# కొత్త ఆదాయపు పన్ను బిల్లుపై కేంద్రం వెనక్కి

## త్వరలో అప్‌డేటెడ్ వెర్షన్!




విశ్వంభర, నేషనల్ బ్యూరో: దిల్లీ: ఆరు దశాబ్దాలుగా అమల్లో ఉన్న ఆదాయపు పన్ను చట్టం–1961 స్థానంలో కొత్త చట్టం తీసుకొచ్చేందుకు కేంద్రం సిద్ధమైన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే ఆదాయపు పన్ను (ఐటీ) నూతన బిల్లు 2025ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. అయితే, ఈ బిల్లును తాజాగా కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకున్నట్లు తెలుస్తోంది. దీన్ని అప్‌డేట్ చేసి మళ్లీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ నూతన ఆదాయపు పన్ను బిల్లును ఈ ఏడాది ఫిబ్రవరి 13న కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. దీనిపై విపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ఈ బిల్లు ను సెలెక్ట్ కమిటీకి పంపించారు. ఈ కమిటీ దీన్ని అధ్యయనం చేసి జులై 21న తమ నివేదికను పార్లమెంట్‌కు సమర్పించింది. మొత్తం 4500 పేజీలతో కూడిన ఈ నివేదికలో ముసాయిదా బిల్లుకు 285 ప్రతిపాదనలు చేసింది. ఈ ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకున్న కేంద్రం.. దానికి అనుగుణంగా కొత్త బిల్లును రూపొందించేందుకు సిద్ధమైంది. ఈ అప్‌డేటెడ్ బిల్లును ఆగస్టు 11న లోక్‌సభ ముందుకు తీసుకురావాలని కేంద్రం నిర్ణయించినట్లు సమాచారం. నూతన ఆదాయపు పన్ను బిల్లుకు సెలెక్ట్ కమిటీ కొన్ని ప్రధాన సూచనలు చేసింది. ముఖ్యంగా ఇంటిపై ఆదాయం పొందుతున్న వారికి ఉపశమనం కలిగేలా కొన్ని ప్రతిపాదనలు సూచించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం గృహ రుణ వడ్డీతో పన్ను మినహాయింపు ప్రయోజనాలు కేవలం సొంతింట్లో ఉంటున్న వారికి మాత్రమే వర్తిస్తున్నాయి. అలా కాకుండా సొంతింటిని అద్దెకు ఇచ్చిన సందర్భాల్లోనూ వడ్డీతో పన్ను మినహాయింపు కల్పించాలని కమిటీ సూచించినట్లు సమాచారం. ఇక, టీడీఎస్, టీసీఎస్ రీఫండ్లను కూడా సరళతరం చేయాలని కమిటీ ప్రతిపాదనలు చేసింది. 1961లో రూపొందించిన ఆదాయపు పన్ను చట్టానికి, 66 బడ్జెట్‌లలో (రెండు మధ్యంతర బడ్జెట్లు కలిపి) ఎన్నో సవరణలు జరిగాయి. దీంతో సంక్లిష్టంగా తయారైంది. పన్ను చెల్లింపుదార్లకు వ్యయాలూ పెరిగాయి. దీంతో ఈ చట్టాన్ని సమీక్షించి, సరళతరం చేస్తామని 2024 జులై బడ్జెట్‌లో ప్రభుత్వం పేర్కొంది. ఆ మేరకు కొత్త బిల్లును రూపొందించారు.

# కేసు నుంచి వైదొలగుతామని సీబీఐ బెదిరిస్తోంది



విశ్వంభర, కోల్‌కతా: దేశవ్యాప్తంగా సంచలనం రేపిన ఆర్జీ కర్ ఆస్పత్రి వైద్యురాలిపై హత్యాచారం కేసులో దోషి సంజయ్‌కు కోల్‌కతాలోని సియాల్దా కోర్టు జీవిత ఖైదు విధించిన విషయం తెలిసిందే. అయితే జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం జరిగి రేపటితో ఏడాది. ఈ నేపథ్యంలో మృతురాలి తల్లిదండ్రులు సీబీఐ కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ కుమార్తె కేసులో తమకు న్యాయం చేయడంలో సీబీఐ విఫలమైందని.. ఆ వ్యవస్థను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అయితే ఈ కేసు దర్యాప్తు నుంచి పూర్తిగా వైదొలగుతామని సీబీఐ అధికారులు తమను బెదిరించినట్లు మృతురాలి తల్లిదండ్రులు తెలిపారు. "మా కుమార్తె కేసు దర్యాప్తు గురించి వారిని ప్రశ్నిస్తే.. ఏకంగా కేసు దర్యాప్తునే ఆపివేస్తామని సీబీఐ అధికారులు బెదిరిస్తున్నారు. ఈ మాటలేవో కోర్టులో చెప్పండి.. అంటే వారి నుంచి సమాధానం లేదు. ఈ కేసును మొదట కోల్‌కతా పోలీసులు దర్యాప్తు చేసి.. తర్వాత సీబీఐకి బదిలీ చేసినా ఫలితం లేకుండా పోయింది" అని మృతురాలి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుమార్తెపై జరిగిన దారుణానికి వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్ జూనియర్ వైద్యులు శనివారం నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో పాల్గొంటామన్నారు. సీబీఐ దర్యాప్తును నిలిపియాలని చేస్తున్న ఆలోచన వెనక చాలా అవినీతి, ఆర్థిక లావాదేవీలు జరిగాయని ఆరోపించారు. వాటిని నిరూపించడానికి ఆధారాలు సేకరిస్తున్నామన్నారు. మెడికల్ కాలేజీలో జరుగుతున్న అవినీతి గురించి తమ కుమార్తె ప్రశ్నించినందుకే ఈ అఘాయిత్యానికి ఒడిగట్టారని.. దీని వెనుక రాజకీయ నేతలూ ఉన్నారని ఆరోపించారు. ఎన్నేళ్లైనా కోర్టులో తమ పోరాటం కొనసాగిస్తామన్నారు. కాగా.. గతేడాది ఆగస్టు 9వ తేదీ రాత్రి ఆర్జీ కర్ ఆసుపత్రి ఆవరణలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన ప్రకంపనలు సృష్టించింది. ఈ కేసుకు సంబంధించి ఆసుపత్రిలోని సీసీటీవీలో నమోదైన దృశ్యాల ఆధారంగా సంజయ్ రాయ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం అతడికి జీవిత ఖైదును విధించింది. అయితే శిక్ష ఖరారు చేయడానికి ముందు.. తాను ఏ నేరమూ చేయలేదని, ఏ కారణం లేకుండానే తనను ఇందులో ఇరికించారని సంజయ్ తన వాదనలు వినిపించాడు.

# ప్రజా ప్రభుత్వంలో మహిళల సంక్షేమానికి పెద్ద పీట

**కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే మా లక్ష్యం**

**మహిళలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు**

**- మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి**



విశ్వంభర, హైదరాబాద్: రాఖీ పండుగ పురస్కరించుకొని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మహిళలందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల ఆత్మీయతకు, అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని కాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం మహిళల సాధికారతతో పాటు మహిళలను కోటీశ్వరులను చేసే సంకల్పంతో చేస్తోందని అన్నారు. ఉచిత బస్సు,గృహజ్యోతి, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరా క్యాంటీన్లు,ఇందిరమ్మ ఇళ్ల మంజూరులోనూ మహిళలకే పెద్దపీట వేస్తున్నామని అన్నారు. మహిళల అభివృద్ధి, సంక్షేమం విషయంలో ఎక్కడా రాజీ పడే ప్రసక్తే లేదని,అక్కా చెల్లెళ్లందరికీ ప్రభుత్వం అన్ని వేళలా అండగా నిలుస్తుందని మంత్రి భరోసా కల్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా రాఖీ పండుగ అత్యంత కోలాహలం నడుమ, ఉత్సాహభరితంగా జరగాలని మంత్రి ఆకాంక్షించారు.

# సింగూరు ప్రాజెక్టుకు ఎలాంటి ఇబ్బందీ లేదు: ఈఎన్‌సీ జనరల్



విశ్వంభర, సింగూరు: సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టుపై డ్యామ్ సేఫ్టీ అధికారులు నివేదిక ఇచ్చిన నేపథ్యంలో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లారు. సింగూరు ప్రాజెక్టు గేట్లు,డ్యామ్ కట్ట నాణ్యతను పరిశీలించారు. నీటి పారుదలశాఖ చీఫ్ ఇంజి నీర్ అంజద్ హుస్సేన్, ఈఎన్‌సీ ఆపరేటింగ్, మెయింటెనెన్స్ శ్రీనివాస్,చీఫ్ ఇంజినీర్ సెంట్రల్ డిజైన్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ తదితరులు ప్రాజెక్టు నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఈఎన్‌సీ జనరల్ మాట్లాడుతూ ప్రాజెక్టుకు ఎలాంటిఇబ్బంది లేదన్నారు. టెంపరరీ మరమ్మతులకు నిధులు కేటాయించామని, సింగూర్ ప్రాజెక్టు డేంజర్ జోన్‌లో లేదని తెలిపారు. వేసవిలో పూర్తి స్థాయి మరమ్మతులు చేస్తామన్నారు. నీరు బేస్ లెవెల్‌కు తగ్గే వరకు ఏమీ చేయలేమన్న ఆయన.. ప్రాజెక్టులో స్టోరేజీ ఎక్కువగా లేకుండా చూస్తామన్నారు.

# రాఖీ పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలి

**- శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



విశ్వంభర, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని మహిళలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని అన్నారు. మహిళల సాధికారతతో పాటు మహిళలను కోటీశ్వరులను చేసే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు, పథకాలు అమలు చేస్తోందని అన్నారు.

గృహజ్యోతి, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరా క్యాంటీన్లు,ఇందిరమ్మ ఇళ్ల మంజూరులోనూ మహిళలకే పెద్దపీట వేయడం జరిగిందన్నారు. రాష్ట్రాభివృద్ధిలో మహిళలందరూ భాగస్వాము లయ్యే వరకు ప్రజా ప్రభుత్వం వారికి అండగా ఉంటుందన్నారు. మహిళల రక్షణ, భద్రత విషయంలో ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతుందని, ఎక్కడ మహిళల అభివృద్ధి, సంక్షేమం విషయంలో ఎక్కడా రాజీ పడేది లేదని అన్నారు. అక్కా చెల్లెళ్లందరికీ తమ ప్రభుత్వం ఎల్లవేళలా అండుబాటులో ఉంటుందని,అందరి దీవెనలతో విజయవంతంగా ప్రజాపాలన సాగిస్తుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.

# కొత్తగూడెం ఎమ్మెల్యే ఎన్నికపై పిటిషన్.. డిస్మిస్ చేసిన సుప్రీంకోర్టు



విశ్వంభర, ఢిల్లీ: కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఎన్నికను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. గతంలోనే కూనంనేని ఎన్నికపై దాఖలైన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ జలగం వెంకట్రావు సుప్రీంకోర్టులో అప్పీల్ చేశారు. కాగా.. అడ్మిషన్ స్థాయిలోనే ఈ పిటిషన్‌ను ద్విసభ్య ధర్మాసనం డిస్మిస్ చేసింది.

# జనగామ జిల్లాలో ఇద్దరు మహిళల దారుణ హత్య

విశ్వంభర, జనగామ: ఇద్దరు మహిళలు దారుణ హత్యకు గురైన ఘటన జనగామ జిల్లాలో చోటుచేసుకుంది. ఇంట్లో నిద్రిస్తున్న తల్లి (75), కుమార్తె (45)ను దుండగులు హత్య చేసి పారిపోయారు. జఫర్‌గఢ్ మండలం తుమ్మడపల్లి ఐ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికుల సమాచారంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆస్తి తగాదాలతోనే ఈ హత్యలు చోటుచేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

# కేసీఆర్ ఫ్యామిలీ..అలీబాబా నలభై దొంగల ముఠా

## అందులో కొత్త ప్రభాకర్ రెడ్డి ఓ సభ్యుడు - టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

విశ్వంభర, హైదరాబాద్ : నువ్వెంత , నీ బతుకెంత అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి నిప్పులు చెరిగారు . శుక్రవారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నువ్వు నా క్యారెక్టర్ అంచనా వేయలేవంటూ కొత్త ప్రభాకర్ రెడ్డికి సూచించారు. రాష్ట్రంలో ఎవర్ని అడిగినా నా క్యారెక్టర్ గురించి చెబుతారన్నారు. నా క్యారెక్టర్‌కి, ప్రభాకర్ రెడ్డి క్యారెక్టర్‌కి చాలా తేడా ఉంటుందని పేర్కొన్నారు.నేను ఎలాంటి వాడినో కేసీఆర్, హరీష్ రావుని అడిగి తెలుసుకోవాలంటూ ప్రభాకర్ రెడ్డికి సూచించారు. రాష్ట్ర ఖజానాని ఎలా దోచుకోవచ్చో అనే విషయంలో కెసిఆర్ ప్రొఫెసర్ అని జగ్గారెడ్డి ధ్వజమెత్తారు. కెసిఆర్ కుటుంబ సభ్యులంతా దోచుకోవడంలో అలీబాబా నలభై దొంగల్లా మారారని, ఆ నలభై మందిలో కొత్త ప్రభాకర్ రెడ్డి కూడా ఒకరని ఆయన విమర్శించారు. దొంగలు మీరైతే, నిందలు మాపై వేస్తారా? అని ఆయన ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతోనే 30 వేల కోట్లు మిగుల్చుకున్నారని ఆయన విమర్శించారు. విద్యుత్తు కొనుగోలు, ఇసుక మాఫియా ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయని ఆయన విమర్శించారు.. ప్రభాకర్ రెడ్డికి ఉన్నంత ఆస్తి నా వద్ద ఉంటే ప్రజలకి ఎప్పుడో పంచేసే వాడినని తెలిపారు.పంచే గుణం మా అమ్మనాన్న నాకు ఇచ్చిన ఆస్తి అని చెప్పారు. భవిష్యత్తులో నేను రూ. వేల కోట్లు సంపాదించినా వాటిని ప్రజలకే పంచుతానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. నా ఆస్తి నా పిల్లల కోసం కాదని.. ప్రజల కోసమని తెలిపారు. రూ. 1000 కోట్లు కొన్ని గంటల్లోనే పంచేస్తానన్నారు. ప్రభాకర్ రెడ్డికి ఎలా పంచాలో కూడా తెలియదని ఆక్షేపించారు. కొత్త ప్రభాకర్ రెడ్డి.. నీవు మగాడవయితే నా ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభాకర్ రెడ్డిది నా స్థాయి కాదన్నారు. కొన్ని విషయాల్లో ఎమోషనల్ కావ్వడం నా బలహీనత అని తెలిపారు. ప్రజల సమస్య వింటే వాళ్ళ కంటే ముందు నాకే ఏడుపు వస్తుందన్నారు. నా చుట్టూ పేదలు ఉంటారని.. నా వద్దకు క్యాన్సర్ పేషెంట్లు సైతం వస్తారని జగ్గారెడ్డి చెప్పారు.



# సాయంత్రంలోగా చంపేస్తాం..

## ఎంపీ రఘునందన్‌రావుకు బెదిరింపులు



విశ్వంభర, హైదరాబాద్: మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు మరోసారి దుండగులు ఫోన్ చేసి బెదిరించారు. హైదరాబాద్‌లోనే ఉన్నామని, సాయంత్రం లోగా చంపేస్తామని హెచ్చరించారు. ఆయనకు ఇలా బెదిరింపు ఫోన్ కాల్ రావడం ఆరోసారి. తాజాగా 9404348431 నెంబర్ నుంచి ఫోన్ వచ్చినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.



# ఫోన్ ట్యాపింగ్‌పై సుద్దపూస మాటలు

గందె గోవర్ధన్

ఫోన్ ట్యాపింగ్ పై సుద్దులు, నీతి సూక్తులు వల్లిస్తున్నాయి దేశంలోని రాజకీయ పార్టీలు. భలే మాట్లాడుతున్నాయి. అన్నీ సుద్దపూస మాటలే. గురివింద సామెతను తలపించే నీతిసూక్తులను తెగ వల్లిస్తున్నాయి. అధికారం అనుభవించిన అన్ని రాజకీయ పార్టీలు కూడా ఏదో ఒక సందర్భంలో అనేక మంది పౌరుల వ్యక్తిగత జీవితాల్లోకి తొంగి చూసినవే. మోతాదులో కొంత ఎక్కువ, కొంత తక్కువే తప్ప రాష్ట్రస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు రాజకీయ అధికారం అనుభవించిన ప్రతీ పార్టీ తమ శత్రువులు, ప్రత్యర్థులుగా భావించిన అనేక మంది రాజకీయ నాయకులు, ఉన్నత స్థాయి బ్యూరాక్రాట్లు, అత్యున్నత అధికార హోదాల్లో ఉన్న వారి వ్యక్తిగత జీవితాల్లోకి తొంగిచూసినవి, చొరబడినవే. జోక్యం చేసుకున్నవే. కొన్ని మీడియా సంస్థలు ఇలాంటి స్టింగ్ ఆపరేషన్ల ద్వారా అనేక కుంభకోణాలు వెలుగులోకి తీసుకు వచ్చాయి. వీటిలో సామాజిక హితం దాగి ఉన్నది. సదరు ఆపరేషన్ లక్ష్యం కూడా అదే. పెద్ద మనుషులుగా చలామణి అయ్యే కొందరి చీకటి జీవితాలను బట్ట బయలు చేశాయి. కారణాలు ఏమైనా కావచ్చునుకానీ అన్ని ప్రభుత్వాలూ ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడినవే. ఫోన్లు ,మొబైల్ సాంకేతిక పరిజ్ఞానం లేని కాలంలో కూడా అప్పటి అవకాశాల ప్రకారం ప్రజల వ్యక్తిగత, రాజకీయ జీవితాల్లో అన్ని రాజ్య వ్యవస్థలూ వేలుపెట్టినవే. దీనిలో దాదాపుగా ఏ రాజకీయ పార్టీకీ, ఏ ప్రభుత్వానికీ మినహాయింపు లేదు. జాతీయ భద్రత పేరిట దేశ అంతర్భాగంలో, శత్రు దేశాలుగా భావించే అనేక దేశాల్లో ఏదో ఒక రూపంలో అనేక మంది పబ్లిక్, ప్రైవేట్ జీవితాల్లో జోక్యం చేసుకున్నవే అత్యధికంగా ఉంటాయి. ఫోన్ ట్యాపింగ్ చేసి అవి వెలుగు చూసిన తరువాత కూలి పోయిన రాష్ట్ర ప్రభుత్వాలు కూడా దేశంలో ఉన్నాయి. పెగాసస్ ఫోన్ ట్యాపింగ్ ఉదంతం దేశంలో కొంతకాలం చర్చలో ఉండేది. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు మొదలు అనేక మంది కీలక జాతీయ ప్రతిపక్ష నాయకులు, స్వపక్షంలోని కొందరు పెద్దలు,గొప్ప జర్నలిస్టులుగా పేరొందిన వారి ఫోన్లు ట్యాప్ అయిన ఉదంతం అప్పట్లో దేశంలో విస్తృత చర్చలో ఉండేది. ఫోన్ ట్యాపింగ్ పై జ్యూడీషియరీకూడా కొన్ని విచిత్రమైన వ్యాఖ్యానాలు చేసింది. ఇప్పుడు జనం పెగాసస్ ను మరచి పోయినట్లుగా అనిపిస్తున్నది. దాదాపుగా అన్ని రాజ్యాంగ వ్యవస్థలను బలహీన పడి పోయిన పరిచినరి తరువాత ట్యాపింగ్‌పై జరిగిన జరుగుతున్న విచారణలు, నిర్ధారణలకు ఎలాం టి విశ్వసనీయతా లేదు. దేశంలోని ఏ విచారణ వ్యవస్థ విచారణలో కూడా నిజం వెలుగు చూస్తు%శీ%దన్న విశ్వాసం పూర్తిగా బలహీన పడి పోయింది. భారత సమాజం ఇప్పుడు సరిగ్గా అలాంటి సందర్భంలోనే ఉన్నది. తెలంగాణలో నిన్నటి ప్రభుత్వం జరిపిందని చెబుతున్న ఫోన్ ట్యాపింగ్ పై ఇప్పటి ప్రభుత్వం నియమించిన సిట్ స్పెషల్ ఇన్ వెస్టిగేషన్ టీం%రి% దర్యాప్తు జరుపుతున్నది. ఈ దర్యాప్తు పై ట్యాపింగ్ బాధ్యులుగా భావిస్తున్న వారు, బాధితులుగా ప్రచారంలో ఉన్న వారు చెబుతున్న మాటలు చూస్తుంటే గురివింద సామెత గుర్తుకు రాక తప్పదు.

# ఆదివాసీ స్వయం పాలనకై ఉద్యమిద్దాం

**(నేడు ఆదివాసీ అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా)**



**ప్రతి సంవత్సరం ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం జరపాలంటూ 1994 డిసెంబర్‌లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ పిలుపునిచ్చింది. ఆనాటి నుండి ప్రపంచీకరణ విధానాలతో అడవులు,ఆదివాసుల జీవితాలు మరింత ప్రమాదంలోకి నెట్టబడుతూనే ఉన్నాయి. జల్, జంగల్, జమీన్ ల నుండి, భాషా-సంస్కృతుల నుండి ఆదివాసులను పరాయీకరించే పరిస్థితి పెరుగుతూనే ఉంది. అందుకేనేమో కంటి తుడుపు చర్యగాన్నైనా ఐక్యరాజ్యసమితి ప్రకటించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవం భారత్‌లోని పదిన్నర కోట్ల ఆదివాసులకు పెద్దగా ఉపశమనం కలిగించలేక పోతున్నది. 17వ శతాబ్దం నుండి ఆదివాసుల తిరుగుబాట్లే భారతదేశ ప్రజలు స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం చేసిన పోరాటాలకు ఎంతో ఊతమిచ్చాయి.'**

**'అడవులల్లో నివసించే ఆదివాసులు/ భారత విప్లవ పోరుకు మూలపురుషులు" అంటూ గర్జించిన కవుల కలాలు ఎన్నో. కానీ నక్సలబరీ, శ్రీకాకుళం, గోదావరిలోయ పోరాటాల మూలంగా వచ్చిన 1 ఆఫ్ 70 అనే భూమి బదలాయింపు నిరోధక చట్టంను ఎత్తేయాలని ఒక ఆదివాసి ఎమ్మెల్యేనే మాట్లాడేంతగా వారిపై ఒత్తిడి ఉందని అర్థం చేసుకోవచ్చును. తమ నేల మీదనే ఆదివాసీ ప్రజలు పరాయి వాళ్లయి పోతుండడం ప్రపంచవ్యాప్త పరిణామంగా ఉంది. అందుకేనా అన్నట్లు 2025 ఆగస్టు 9నాడు ఆదివాసి దినం జరుపుకునే సందర్భంగా "ఆదివాసి ప్రజల స్వయం నిర్ణయాధికార హక్కు-ఆహార భద్రత మరియు సార్వభౌమాధికారానికి ఒక మార్గం" అంటూ పిలుపునిచ్చింది. అందుకే ఈ సందర్భంగా అడవుల నిర్మూలనకు, ఆదివాసి జీవితాల పరాయీకరణకు వ్యతిరేకంగా "ఆదివాసుల స్వయం పాలనా హక్కుల కోసం పోరాడేందుకు ప్రతినబూనుదాం.**

**దిగజారుతున్న ఆదివాసీల పరిస్థితి..**

తొంబ్బైదేశాల్లో దాదాపు 48కోట్ల జనాభా (476 మిలియన్లు)తో ఆదివాసులు ప్రపంచ జనాభాలో ఆరు శాతంగా ఉన్నారు. ఒక్క భారత్ లోనే 705 తెగ జాతులతో మనదేశ జనాభాలో 8.6 శాతంగా పదిన్నర కోట్లకు పైగా షెడ్యూల్డ్ తెగల ప్రజలు ఉన్నారు. కానీ ప్రపంచవ్యాప్తంగా ఉన్న పేదల్లో 15% ఆదివాసులేనని పలు నివేదికలున్నాయి. ఏడు వేల భాషలు, ఐదు వేల విభిన్న సంస్కృతులతో, తెగలతో ఆదివాసులు నివసిస్తున్న ప్రాంతం నిజమైన భిన్నత్వంతో కూడుకుని ఉంది. అది 28 శాతం భూగోళాన్ని ఆక్రమిస్తే, వారి నివాసం చుట్టూ 11 శాతం అడవులు విస్తరించి ఉన్నాయి. సహజసిద్ధ అడవుల సంరక్షకులుగా, పర్యావరణ పరిరక్షకులుగా, యాభై శాతానికి పైగా ఆహార స్వయం సమృద్ధి కలిగిన ఆదివాసులు నేడు కార్పోరేట్ల దాడిలో సర్వం కోల్పోతున్నారు. పరాయీకరణ ప్రధాన సమస్యగా మారిన పరిస్థితిలో, తాము పుట్టి పెరిగిన అడవుల్లోనే మైనారిటీగా మారుతున్నారు. విప్లవ పోరాటాలతో, అనన్య త్యాగాలతో ఆదివాసుల భూమి బదలాయింపు నిరోధక రెగ్యులేషన్ 1 ఆఫ్ 70 చట్టం, 1996 పెసా చట్టం, రాజ్యాంగంలోని 5,6 షెడ్యూల్లలోని రక్షణలు, 2006 అడవి హక్కుల చట్టం ఏవీ వారిని కాపాడలేక పోతున్నాయి. సరిగ్గా పాడేరులోనే పంప్డ్ హౌస్ పవర్ ప్రాజెక్టుల పేరు మీద గౌతం అదానీ పవర్ ప్రాజెక్టు అడవులను, గ్రామాలను కబళించింది. బాక్సైట్ తవ్వకాల కార్యక్రమం తలపైన వేలాడుతుంది. పోలవరంలో మునిగిన 200 ఆదివాసీ గ్రామాలకు నేటికీ సరయిన పరిహారం లేదు. రక్షణావసరాల పేరు మీద అడవులు, గూడాలు ఖాళీ అవుతుండగా, పెసా చట్టం చిన్నబోయింది. వేలాది సంవత్సరాలు ఆదివాసులు, జంతువులు పశు పక్షాధులతో సహజీవనం చేస్తున్నారు. కానీ నేషనల్ పార్కులు, పులుల సంరక్షణ కేంద్రాలు, అభయారణ్యాలు, వన్యప్రాణి కేంద్రాలు, నీటి ప్రాజెక్టులు, రవాణా మార్గాలు, ఖనిజాభివృద్ధి సంస్థలు, బొగ్గు నిక్షేపాలు, రక్షణావసరాలు అంటూ అడవుల నుండి ఆదివాసుల గెంటివేత సర్వసాధారణమైంది. నూరేళ్ళుగా సాగుచేస్తున్న కొందరు ఆదివాసులకు పట్టాలు లేకపోవడం, నూరుశాతం అడవులున్న గ్రామాలను, మండలాలను షెడ్యూల్డు ఏరియా పరిధిలోనికి తేకపోవడంతో ఆదివాసేతర పెత్తందార్ల ఆక్రమణలు పెరగడం, స్మగ్లర్లను వదిలి బొమ్మకొయ్య (ఎర్రచందనం) పేరుతో సామాన్య ఆదివాసులనే వేధించడం సర్వసాధారణమయింది. మైదానాల్లో చేపల వేటపై ఆధారపడ్డ యానాదుల బతుకులు దుర్బలంగా ఉన్నాయి. కొన్ని దుర్బ జాతులు అంతమయ్యే స్థితిలో ఉన్నాయని నివేదికలున్నాయి.

అత్యంత ఆదిమజాతిగా ప్రసిద్ధిగాంచి, సునామీలను పసిగట్టగలిగిన అండమాన్ నికోబర్ దీవుల్లోని జారోవా తెగ ప్రజల నివాసాల మధ్య నుండి జంతువుల సఫారీ లాగా పర్యాటకుల రోడ్డు నిర్మించారు. మనుషులను జంతువుల్లా చూసే హ్యూమన్ సఫారి పద్ధతిని 2002లో సుప్రీంకోర్టు నిషేధించింది. అయినా చట్ట విరుద్ధంగా ఇది సాగుతూనే ఉంది. తాజాగా 72,000 కోట్ల వ్యయంతో అక్కడ నిర్మాణం అవుతున్న ఇంటర్నేషనల్ కంట్యెనర్ ట్రాన్షిప్మెంట్ పోర్ట్ ప్రాజెక్టులు రెండు పురాతన దుర్బల తెగల్కైన షాప్మెన్, నికోబార్‌లు మాయమైపోతున్నాయి.

ఇక ఫార్మా ఈస్ట్ అండ్ కాంటా బేసిన్ అనే అదానీ కంపెనీ చత్తీస్ఘఢ్ లోని హస్టేవ్ అరాండ్ అడవిలో బొగ్గు తవ్వకాలకై ఐదు లక్షల చెట్లను కొట్టేస్తున్నారు. ప్రజాభిప్రాయంతోనే ఇదంతా చేస్తున్నాం అంటున్నా అదంతా బూటకమని ప్రజలు ఆందోళన బాటపట్టారు. ఘాట్బర్రాతో పాటు కొన్ని గ్రామాలు తుడిచిపెట్టుకుపోతున్నాయి. దాదాపు లక్షల విలువచేసే వందలాది వ్యాపార ఒప్పందాలతో విలువైన ఖనిజ సంపద కార్పొరేట్ల వశం చెయ్యబోతున్నందున అక్కడ మావోయిస్టులతో శాంతి చర్చలను నిరాకరిస్తున్నారు. అక్కడే ఆదివాసుల నరమేధం కొనసాగుతుంది. సంపద కొద్దిమంది చేతుల్లో పడరాదన్న సుప్రీంకోర్టు మాటలు సైతం పెడచెవిన పెట్టబడుతున్నాయి.

అరుణాచల్ ప్రదేశ్లో వేలాదిమంది ఆదివాసులను నిర్వాసితులను చేసే ఎగువ సియాంగ్ బహుళార్ధక సాధక ప్రాజెక్టు (ఖూవీరీ)కు వ్యతిరేకంగా సాగుతున్న ఆందోళనను అణిచివేస్తున్నారు. అస్సాంలో ఖాజీరంగ ఉద్యానవనం సమీపంలో ఫైవ్ స్టార్ హోటల్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్న ప్రజలపై అణచివేత సాగుతోంది. ఇక మణిపూర్ మారణహోమం నాగా, కుకీ జాతి తెగలను అణిచివేసే దుర్మార్గమైన కుట్ర మాత్రమే. అదే దేశ రక్షణ పేరిట 2023లో అటవి రక్షణ చట్టానికి సవరణలు చేస్తూ కేంద్రం చేసిన నూతన చట్టం విదేశీ సరిహద్దుల నుండి 100 కిలోమీటర్ల వైశాల్యాన్ని, 10 హెక్టార్లలో ఏద్కైనా నిర్మాణం చేసుకునే అంశం ఈశాన్య రాష్ట్రాల అస్తిత్వాన్ని ప్రశ్నార్థకం చేసింది. భారత రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్లో ఉన్న ఈ ప్రాంతంలో జిల్లాల వారీగా స్వయంపాలన మండల్లు ఉన్నాయి. కానీ ఆ రాజ్యాంగ రక్షణలు ప్రశ్నార్థకమైతున్నాయి. పులుల అభయారణ్యం పేరిట జీవో నం. 49 చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసుల ఆందోళన ఫలితంగా వెనక్కు తగ్గింది. ఆదివాసుల భాష - సంస్కృతి వనరుల విధ్వంసం అడవుల నుండి గెంటివేత ప్రపంచవ్యాప్త సమస్యగా మారింది. బ్రెజిల్లో 100 ఆదిమ తెగలు అంతర్ధానం అయ్యే స్థితి ఏర్పడ్డది. ప్రపంచంలోనే 82.5 సం.రాల సగటు ఆయుర్దాంతో ముందు వరుసలో ఉన్న ఆస్ట్రేలియాలో భూములు కోల్పోయిన ఆదిమ జాతులు పదేళ్ళ తక్కువ కాలం బతుకుతున్నాయి. మధ్యాహ్నం భోజనం కొరవడిన మనదేశ ఆదిమ జాతుల ప్రజలు అతి చిన్న వయస్సులోనే ప్రాణాలు కోల్పోతున్నారు. పెరుగ్వే, బ్రెజిల్, అర్జెంటీనాలో నివసిస్తున్న గోవరాని కయోవా తెగ జాతులు తమ పూర్వీకుల నుండి వచ్చిన భూములన్ని కోల్పోతున్న కారణంగా 30 సంవత్సరాల లోపే ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇది ప్రజల్లోని ఇతర ప్రాంతాలతో పోల్చుకుంటే 19 రెట్లు ఎక్కువ. ఆస్ట్రేలియా కెనడాలోను ఆదిమ తెగల్లో ఆత్మహత్యలు అత్యధికంగా ఉన్నాయి. అనేకమంది ఆంత్రోపాలజిస్టులు అవి నాగరిక సమాజాలు విధిస్తున్న మరణశిక్షలని అభివర్ణిస్తున్నారు.

బ్రిటిష్ వలస పాలకులు సహజ అడవులను సరుకుగా మార్చి మొట్టమొదటిసారిగా 1927లో అటవీ చట్టం చేసింది మొదలు అడవులన్నీ పెట్టుబడిదారుల సంపదగా మారాయి. దీనికి అనుగుణంగానే చట్టాలు చేస్తూ వస్తున్న పాలకులు ఆదివాసుల తిరుగుబాటులతోనే కొన్ని సంస్కరణలు తెచ్చారు. కానీ నేడు పచ్చిగా కార్పోరేట్ అనుకూల విధానాలతో ప్రజావ్యతిరేక చట్టాలు ఊపందుకుంటున్నాయి. ప్రజా వ్యతిరేక విధానాలతో క్రీస్తు శకం 1260లో బలమైన కాకతీయ సామ్రాజ్యంతోనే పోరాడిన సమ్మక్క సారక్కలు, మొగలాయిలను- రాజాధిరాజులను ఎదిరించిన బిర్సా ముండా, 1940లో నిజాం పాలకులను సవాల్ చేసిన కొమరం భీమ్, బ్రిటిష్ వాళ్లతో ఎదురొడ్డి పోరాడిన రాంజీ గొండు, అల్లూరి మన్యం పితూరి లాంటివి చరిత్రలోనే కొన్ని రికార్డ్ అయినాయి. కానీ ఉరితీయబడ్డ కారం తమ్మన్న (ముఠాదారు) అదేవిధంగా జమీందారు కోరుకొండ సుబ్బారెడ్డిని 1857లో ఉరితీసి రాజమండ్రి కోటలో 1929 వరకు మృతదేహాన్ని ఇనుపబోనులో పెట్టి అలాగే ఉంచారు. నేటికీ ప్రజా తిరుగుబాటులను అణిచివేయడం నిరంతరం జరుగుతూనే ఉంది. అందుకే 2019 ఎన్నికల్లో బ్రెజిల్ అధ్యక్షుడిగా లిబరల్ అభ్యర్థిగా పోటీ చేసిన జైర్ మెస్సియాస్ బోల్సోనారో "ఒక్క ఇంచు కూడా ఆదివాసుల భూమి లాకోనివ్వనని" వాగ్దానం చేసి గెలిచాడు. ఈరోజు లక్షలాది ఎకరాల అటవీ భూములు కార్పొరేట్లమయవుతుంటే ఒక్కరైనా అడ్డుకునే వాల్లున్నారా? అంటూ రోజు నెత్తురోడుతున్న ఆదివాసి సమాజం ఎదురుచూస్తోంది. అందుకే ఆదివాసులకు సంఘీభావంగా స్వయంపాలనకై కదం దొక్కుదాం. - అమర్

# అపర ధన్వంతరి యల్లాప్రగడ సుబ్బారావు

**(నేడు ఆయన వర్ధంతి)**



కేన్సర్ చికిత్సలో ఉపయోగించేందుకు మెథోట్రెక్సేట్‌ను అభివృద్ధి చేసినవారు ఎల్లాప్రగడ. మానవ శరీరంలోని కణాలకు శక్తినిచ్చేది ఎడినోసిన్ ట్రై ఫాస్ఫేట్ (ఏటీపీ) అని కనుగొన్నదీ ఆయనే. ఫైలేరియాకు హెట్రాజన్ కనుగొన్నది కూడా ఆయనే. యల్లాప్రగడ పర్యవేక్షణలో వెలువడిన (ఆరోమైసిన్ ) రోగ నిరోధకాలు పెన్సిలిన్ కంటే ఎంతో శక్తిమంతమైనవి. ఆయన కనిపెట్టిన ఫోలిక్ యాసిడ్, స్ప్రూ మందులు నేటికీ మానవాళికి ప్రాణాధారాలు! అందుకే ఎల్లాప్రగడ వైద్యశాస్త్రానికీ, జీవ రసాయనిక శాస్త్రానికీ చేసిన సేవలు చిరస్మరణీయంగా ఉండిపోయాయి.

యల్లాప్రగడ సుబ్బారావు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో 1895, జనవరి 12న నిరుపేద సనాతన సంప్రదాయ కుటుంబంలో జన్మించారు. జగన్నాథం, వెంకమ్మ దంపతుల ఏడుగురు సంతానంలో నాలుగో సంతానం. రాజమండ్రిలో ప్రాథమిక విద్య చదువుతున్నప్పుడు ఈ అబ్బాయి తమ్ముడు రక్తహీనత వల్ల బాధపడుతుండేవాడు. తండ్రి దగ్గర డబ్బుల్లేక సరైన వైద్యం చేయించలేకపోయేవాడు. ఇలాంటి కుటుంబ పరిస్థితుల్లో సుబ్బారావు రెండుసార్లు మెట్రిక్ పరీక్ష తప్పాడు. పరీక్ష తప్పినందుకు ఇంట్లో వారికి భయపడి 13 సంవత్సరాల వయసులో ఇల్లు వదిలి కాశీ(బెనారస్)కి పారిపోయాడు. అక్కడ యాత్రికులకు అరటి పండ్లు అమ్ముతూ బతికేవాడు. లక్ష్యం తెలియక అక్కడి రామకృష్ణ మిషన్‌లో చేరి సన్యాసిగా మారాలనుకున్నాడు. కానీ తల్లి అనుమతి లేనిదే సన్యసించడానికి వీలు లేదని మఠాధిపతులు చెప్పారు. దీంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాడు.రైన వైద్యం లేక ప్రాణాలు కోల్పోతున్న వారిని చూసి చలించిపోయాడు. మానవాళి ఉసురుతీస్తున్న వ్యాధుల అంతు చూడాలని వైద్యవృత్తిని చేపట్టాలనుకున్నాడు. వెంటనే మద్రాసు వెళ్లాడు. అక్కడి హిందూ హైస్కూల్‌లో చేరి మెట్రిక్ పరీక్ష పాసయ్యాడు. ఆ తర్వాత ప్రెసిడెన్సీ కాలేజీ నుంచి ఇంటర్మీడియట్ పాసవడం, ఆ వెంటనే మద్రాసు మెడికల్ కాలేజీలో వైద్యవిద్యలో ప్రవేశించడం జరిగిపోయాయి.

యల్లాప్రగడ ప్రెసిడెన్సీ కాలేజీలో ఇంటర్ చదివాక, మద్రాస్ వైద్య కళాశాలలో చేరారు. రాజమండ్రిలో ఉండగా చిలకమర్తి లక్ష్మీనరసింహం గారి సంస్కరణల ధోరణినీ, వందేమాతరం ఉద్యమం వేడినీ చూసిన ఎల్లాప్రగడ విదేశీ వస్త్ర బహిష్కరణ కోసం గాంధీ ఇచ్చిన పిలుపునకూ స్పందించారు. ఖద్దరుతో ఆపరేషన్ థియేటర్‌లో కనిపించారు. ఇదే జీవితం మీద తొలిదెబ్బ అవుతుందని ఆయన ఊహించలేదు. సర్జరీ ప్రొఫెసర్ ఎంసీ బ్రాడ్‌ఫీల్డ్‌కు అది తీవ్ర ఆగ్రహం తెప్పించింది. పరీక్ష బాగా రాసినా ఎల్లాప్రగడకు పూర్తి స్థాయిలో ఎంబీబీఎస్ పట్టా ఇవ్వనివ్వలేదు. ఎల్ఎంఎస్ సర్టిఫికెట్‌తో సరిపెట్టారు. ఈ సర్టిఫికెట్‌తో మద్రాసు మెడికల్ సర్వీసులో చేరడానికి ఆయన ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. కానీ వైద్యవిద్యపై ఉన్న ఇష్టంతో డాక్టర్ ఆచంట లక్ష్మీపతిగారు మద్రాసులో స్థాపించిన ఆయుర్వేద వైద్యకళాశాలలో 'అనాటమీ' ప్రొఫెసర్‌గా చేరాడు. ఆయుర్వేద ఔషధాలలోని రోగ నిరోధక లక్షణం ఆయనను ఎంతో ఆకర్షించింది. కొత్త పద్ధతులను మేళవించి పరిశోధన ప్రారంభించారు. ఇంతలోనే హార్వర్డ్ మెడికల్ కళాశాలలో ఉష్ణమండల రుగ్మతల విభాగం నుంచి పిలుపు వచ్చింది. మల్లాడి సత్యలింగనాయకర్ చారిటీస్ (కాకినాడ) వారి సాయం కూడా అందింది. ఛారిటీ సంస్థలు ఇచ్చిన ఆర్థిక సాయంతో ఆయన అమెరికాలోని బోస్టన్‌కు వెళ్లారు. కానీ ఆయనకున్న మెడికల్ డిగ్రీతో ఏ స్కాలర్‌షిప్ రాలేదు. దాంతో ఆయనకు బోస్టన్ హాస్పిటల్స్‌లో ప్రవేశం దొరకలేదు. అలాంటి పరిస్థితుల్లో అక్కడే పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేశాడు. అలా వచ్చిన డబ్బుతో 'హార్వర్డ్ స్కూల్ ఆఫ్ ట్రాపికల్ మెడిసిన్'లో చేరాడు. మెడిసిన్‌లో డిప్లొమా సంపాదించి అక్కడి పరిశోధనాశాలలోనే అసిస్టెంట్‌గా చేరాడు. వైద్య పరిశోధనలో ఎల్లాప్రగడ ప్రతిభ ఎంతటిదో మొదట రుజువైనది ఇక్కడే. మనిషి రుగ్మతలు ఎన్నింటికో ఎల్లాప్రగడ మందు కనిపెట్టారు. అమెరికాలో రాత్రీ పగలు కష్టపడుతూ తన ప్రతిభా పాటవాలతో 'స్కాలర్‌షిప్'లు సంపాదిస్తూ వైద్య పరిశోధనలు కొనసాగించారు. 1922లో నోబెల్ బహుమతి అందుకున్న సిద్ధాంతాన్ని సుబ్బారావు పరిశోధనాత్మకంగా పరిశీలించి, అర్థవంతంగా లేదని రుజువు చేశారు. ఆ సిద్ధాంతంపైనే మళ్లీ పరిశోధన సాగించి, దిగ్భ్రాంతి గొలిపేలా సరికొత్త సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ఆ సిద్ధాంతమే 'డా. ఫిస్కే%-%సుబ్బారావు మెథడ్'గా నేటి వైద్య కళాశాలల్లో పాఠ్యాంశంగా ఉంది. ఇది ప్రపంచ వైద్య పరిశోధనా రంగంలో ఒక అనూహ్యమైన చారిత్రాత్మక సంఘటన. 'న్యారోస్పెక్ట్రమ్ యాంటి బయాటిక్స్%-% పెన్సిలిన్, స్ట్రెప్టోమైసిన్ వంటి మందులు కనుగొన్న వారికి నోబెల్ బహుమతులు లభించాయి. కానీ వాటికన్నా శ్రేష్ఠమైన, ప్రపంచంలో తొలి బ్రాడ్ స్పెక్ట్రమ్ యాంటి బయాటిక్ టెట్రా'మైసిన్' మాతృక టెట్రా'సైక్లిన్' మందును కనుగొన్న డా. యల్లాప్రగడకు నోబెల్ బహుమతి ఇవ్వకపోవడం శోచనీయం. అయితే నోబెల్ బహుమతిని ఎంపిక చేసే 'స్టాక్‌హోమ్' నగరంలోని వారి ప్రధాన కార్యాలయంలో సుబ్బారావు తైలవర్ణ చిత్రం దర్శనమిస్తుంది. బహుశా నోబెల్ బహుమతి ఇవ్వనందుకు ప్రాయశ్చిత్తంగా ఆ చిత్రాన్ని అక్కడ ఉంచారేమో!గతంలో ప్లేగు మహమ్మారి ప్రపంచ మానవాళిని చుట్టుపెట్టినప్పుడు టెట్రామైసిన్ మందు ప్రాణరక్షక ఔషధంగా కాపాడింది. ఇటీవల భూగోళాన్ని భయభ్రాంతులకు గురిచేసిన కరోనా వ్యాధిని డాక్స్'సైక్లిన్', అజిత్రో'మైసిన్' వంటి మందులు కీలకపాత్ర వహించి ప్రజలను కాపాడాయి. ఈ మందుల సృష్టికర్త డా. యల్లాప్రగడ సుబ్బారావు. ప్రాణాంతక వ్యాధి క్యాన్సర్‌కి కీమోథెరపిలో తొలితరం ఔషధం మెథాట్రాక్సిన్ మందును, క్షయ వ్యాధికి 'ఐసోనెక్స్', బోధకాలు, ఇస్నోఫీలియాకు హెట్రజన్ మందును ఆయన కనుగొన్నారు.

ప్రపంచ మానవాళిని గడగడలాడించిన ప్రాణాంతక ఉష్ణమండల%-%'స్ప్రూ' వ్యాధికి దివ్యౌషధం 'ఫోలిక్ ఆసిడ్' పోషకాన్ని డా. యల్లాప్రగడ 1945 జూలై 20న కనుగొన్నారు. తద్వారా ఆ వ్యాధి కోరలు ఊడబెరికి భూగోళం నుండి పారద్రోలారు. ఈ స్ప్రూ వ్యాధి ఒకటి ఉన్నదని నేటి తరం వారికి అసలు తెలియనే తెలియదు. తన సోదరుని మరణానికి కారణమైన ఈ వ్యాధికి కనిపెట్టిన ఆనాటి 'ఫోలిక్ ఆసిడ్%-% పోషక విటమిన్' ఈ రోజు గర్భిణులకు సంజీవనిలాగాను, పుట్టబోయే బిడ్డల ఆరోగ్యానికి 'వెన్ను' దన్నుగాను పనిచేస్తున్నది. అంతేగాక క్యాన్సర్, గుండెజబ్బులు, మానసిక వ్యాధులు, పక్షవాతం మొదలైన వాటిని నియంత్రించడంలో 'కల్పతరువులా%-%యాంటి ఆక్సిడెంట్'గా ఉపయోగపడుతోందని నివేదికలు వెల్లడిస్తున్నాయి. అంటే ఆయన వైద్య పరిశోధనా ఫలితాలు ఎంతటి మహత్తరమైనవో కదా!

కనుగొన్న స్వల్పకాలానికే నిరుపయోగమవుతున్న మందులున్న ఈ రోజుల్లో కూడా డా. యల్లాప్రగడ కనుగొన్న ఆనాటి మందులు బహుళ ప్రయోజన ఔషధాలుగా పనిచేస్తున్నాయి. తాను కనుగొన్న మందుల ద్వారా ప్రపంచ మానవాళికి ఒక 'శాశ్వత ఆరోగ్యకవచం' అందించిన క్రాంతదర్శి, అపర ధన్వంతరి డా. యల్లాప్రగడ సుబ్బారావు. మనకు చరిత్ర తెలియక నేటి ఆధునిక విజ్ఞాన శాస్త్ర పరిశోధనలు అన్నీ విదేశీయులు, ఇంగ్లీషు శాస్త్రవేత్తలు కనిపెట్టినవే అనుకుంటున్నాం. ఇప్పుడున్న మందుల షాపుల్లో స్థిరమైన మందులు ఎక్కువగా మన తెలుగువాడు డా. సుబ్బారావు కనిపెట్టినవే!

గతంలో డా. సుబ్బారావు అమెరికా వెళ్లి తిరిగి రాలేదని కొందరు భావించారన్న వార్తలు వినవచ్చాయి. 1948లో అమెరికా నుంచి ఒకసారి స్వదేశం వచ్చిన ఆయన మద్రాస్ మెడికల్ కాలేజీలో ఒక వైద్య సదస్సులో పాల్గొన్నారు. ఆ సభలో తాను గతంలో డా. లక్ష్మీపతి ఆయుర్వేద వైద్య కళాశాలలో 'అనాటమీ లెక్చరర్'గా పనిచేసి, ఆయుర్వేదంపై అధ్యయనం చేసి, ఆ అనుభవంతో 'ప్రాచీన ఆయుర్వేదం పునాదిపై ఆధునిక అల్లోపతి వైద్యశాస్త్ర సమన్వయంతో నా వైద్య పరిశోధనలలో సత్ఫలితాలు సాధించాను' అని తెలియజేశారు.

కాబట్టి మన దేశంలో ఆయుర్వేదం, అల్లోపతి%-%ఆంగ్లవైద్యం సమన్వయంతో 'ఇంటిగ్రేటెడ్ మెడికల్ కాలేజీ' ఏర్పాటు చేయాలని, 'క్యాన్సర్ పరిశోధన హాస్పిటల్' ఏర్పాటుచేసి ప్రజలకు తన వైద్యసేవలు అందించాలని' ఆనాటి సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా ఆయన తెలిపిన కథనం ఉంది. డా. యల్లాప్రగడ సుబ్బారావు 1948 ఆగస్టు 9న నిద్రలోనే గుండెజబ్బుతో కన్నుమూశారు. ఆయన కనిపెట్టిన అజరామరమైన దివ్యౌషధాలు ప్రపంచ మానవాళి శ్వాసలో శాశ్వతంగా నిలిచిపోతాయి. భావితరాలకు వీరి జీవిత చరిత్రను అందించడానికి ప్రభుత్వం ఒక పరిశోధన కమిటీని ఏర్పాటు చేయాలి. ఆయన జీవిత చరిత్రను అన్ని ప్రాంతీయ భాషల విద్యార్థులకు పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలి. తద్వారా విద్యార్థులలో నైతిక విలువలు పెంపొందించాలి.



# ఎన్నికలు వద్దు.. ఎంపికలే ముద్దు..

ఎన్నికల వల్ల ఖర్చు. పంచాయితీ బోర్డ్, మండల ప్రజా పరిషత్తు, జిల్లాపరిషత్తు, మున్సిపాలిటీ, శాసనసభ, పార్లమెంటు. వీటికి ఎన్నికలు. దానికి ఓ అనవసర ఖర్చు. ఎన్నికల తరువాత వాటికి మళ్ళీ పాలక మండళ్లు, అసెంబ్లీలు,శాసన మండళ్లు,పార్లమెంటుల ఏర్పాటు. రాష్ట్రాల్లో, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం. ఇదంతా ఏమిటి ? ఇన్ని ప్రభుత్వాలు అవసరమా? మొత్తం దేశానికి ఒక ప్రభుత్వం చాలదా? చాలును కదా. పంచాయితీలు,మండల, జిల్లా పరిషత్తులు, రాష్ట్రాలకు అసెంబ్లీలు ఎందుకు? పార్లమెంటు ఒకటి చాలదా? చాలును కదా. అసలు పార్లమెంటు కూడా ఎందుకు? దానికి 500 లకు పైగా సభ్యులను ఎన్నుకోవాలి. దానికో ఖర్చు. ఎన్నికైన ఎంపిలకూ జీతాలు,బత్యాలు ఇవ్వాలి కదా. ఇవన్నీ అనవసర ఖర్చులే కదా. అసలు ఎన్నికలే లేకుంటే.. ఈ ఖర్చులన్నీ మిగిలి పోతాయి కదా. అందువల్ల ఎన్నికలను రద్దుచేసి పారేయడం బెస్ట్. ఒక "జాతీయ" వాది/"పెద్ద మనిషి"ని రాజు(చక్రవర్తి)గా ఎంపిక చేసి ఆ కుర్చీలో కూర్చో బెడితే ఈ వ్యయం అంతా ఆదా అయిపోతుంది కదా. ఆయనే జీవిత కాలం రాజు(చక్రవర్తి)గా ఉంటారు. ఆయన మరణానంతరం ఆయన కొడుకో, కూతురో వారసత్వం తీసుకొని ఆ సింహాసనాన్ని అధిష్టిస్తారు. ఆయనకు వారసులు లేకుంటే మరొకరిని రాజుగా ఎంపిక చేస్తే చాలును. ఎన్నికలను రద్దుచేసి పారేసి, ఎంపికల పద్ధతిని అనుసరించడం వల్ల ఎన్నికల నిర్వహణ ఉండదు. దానికి ఖర్చు ఉండదు. సమయం కలిసి వస్తుంది. అభివృద్ధి పనులకు ఎన్నికల కోడ్ పేరిట ఇప్పుడు ఉన్న ఆటంకాలు ఏమీ ఎంపికల విధానంలో ఉండవు కదా. అందువల్ల ఎన్నికలను రద్దు చేసి పారేయడం అత్యుత్తమం.

- గందె గోవర్ధన్

# ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించాలి



## - సిట్ విచారణతో కాలయాపన తప్ప ఇంకేం జరగదు
## - కేసీఆర్ ప్రభుత్వంలో అత్యధికంగా నా ఫోన్ కాల్స్‌నే ట్యాప్ చేశారు
## -భార్యాభర్తల ఫోన్లూ ట్యాప్ చేసి విన్నారు - కేంద్ర మంత్రి బండి

విశ్వంభర, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణను సీబీఐకి అప్పగించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని దిల్‌కుషా అతిథి గృహంలో సిట్ విచారణకు హాజరైన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. కేసీఆర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి కుమ్మక్కయ్యారని ఆరోపించారు. అందుకే కేసీఆర్ కుటుంబానికి సీఎం క్లీన్ చిట్ ఇచ్చారని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ సిట్‌కు అధికారాలు లేవని, విచారణతో కాలయాపన తప్ప ఇంకేం జరగదని అన్నారు. గతంలో భారత రాష్ట్ర సమితి దోచుకుందని, ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుంటోందని దుయ్యబట్టారు. "కేసీఆర్ ప్రభుత్వంలో అత్యధికంగా నా ఫోన్ కాల్స్‌నే ట్యాప్ చేశారు. నా కుటుంబ సభ్యులు, పని మనుషుల ఫోన్లు కూడా ట్యాప్ చేశారు. భార్యాభర్తల ఫోన్లూ ట్యాప్ చేసి విన్నారు. నా వద్ద ఉన్న ఆధారాలు, సమాచారం అధికారులకు ఇచ్చాను. వాస్తవానికి మావోయిస్టులకు సంబంధించిన ఫోన్లు ట్యాప్ చేయాలి. కానీ, ఆ జాబితాలో మా పేర్లు పెట్టి ట్యాపింగ్‌కు పాల్పడ్డారు. రేవంత్‌రెడ్డి, హరీశ్‌రావు ఫోన్లు కూడా ట్యాప్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మొదటిసారి వాంగ్మూలం ఇచ్చింది నేనే. కేసీఆర్ ప్రభుత్వం విచ్చలవిడిగా ఫోన్లు ట్యాప్ చేసింది. కేసీఆర్ కుమార్తె, అల్లుడి ఫోన్లు కూడా ట్యాప్ చేశారు. గత ప్రభుత్వంలో సాధారణ ఫోన్ కాల్స్ మాట్లాడేందుకు భయపడి వాట్సప్ కాల్స్ మాట్లాడేవాళ్లు. అప్పటి భారత రాష్ట్ర సమితి మంత్రులు, ఎమ్మెల్యేల ఫోన్లు కూడా ట్యాప్ చేశారు.కేసీఆర్ కుమార్తె, అల్లుడి ఫోన్లు ట్యాప్ చేశారు. వారినీ విచారణకు పిలవాలి. ఎస్ఐబీని సొంత అవసరాలకు అడ్డాగా కేటీఆర్ మార్చారు. నాయకులు, లాయర్లు, వ్యాపారులు, సినీ నటులు, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ల ఫోన్లు కూడా ట్యాప్ చేశారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసు విచారిస్తున్న హైకోర్టు జడ్జి ఫోన్ కూడా ట్యాప్ చేశారు. ఫోన్ల ట్యాపింగ్ ద్వారా అనేక లావాదేవీలకు సంబంధించి లబ్ధి పొందారు. ప్రభాకర్‌రావు, రాధా కిషన్‌రావు బాగోతం చెబుతుంటే నాకే సిగ్గనిపించింది. వారిద్దర్నీ సమాజం క్షమించదు. ఇద్దరికీ ఉరిశిక్ష వేస్తే ఒకేసారి చనిపోతారు.. క్షణక్షణం బాధపడాలి. మా కార్యకర్తలను, ఇతర పార్టీ నాయకులను క్షోభకు గురి చేశారు. ఇద్దరు నిందితులను కాపాడే ప్రయత్నం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తోంది. వ్యాపారుల లావాదేవీలు తెలుసుకొని కేటీఆర్ బ్లాక్‌మెయిలింగ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా రూ.వేల కోట్లు దోచుకున్నారు. ఎన్నికల వేళ కాంగ్రెస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి వద్ద రూ.7 కోట్లు పట్టుకున్నారు. ఆ డబ్బు ఏమైందో తెలియదు. చాలా మంది నాయకుల వద్ద రూ.వందల కోట్లు సీజ్ చేసి పట్టుకున్నారు. పట్టుబడిన డబ్బులను కేసీఆర్, కేటీఆర్‌కు ప్రభాకర్‌రావు, రాధాకిషన్‌రావు పంపారు. రూ.20 కోట్లు దొరికితే.. కేసీఆర్, కేటీఆర్ ఫోన్ చేశాక రూ.2 కోట్లు అవుతాయి. రూ. వేల కోట్లు అక్రమాలు జరిగితే.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకోదా? ఈడీకి లేఖ రాస్తే విచారణ జరుపుతుంది. సిట్ అధికారులు నిజయితీ పరులు, వారిపై మాకు అనుమానం లేదు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపైనే మా అనుమానం అంతా. ఫోన్లు ట్యాప్ చేసినట్లు ఆధారాలున్నా ఎంతకాలం గడుపుతారు. కమిషన్లు వేసి కాలయాపన చేస్తారు. నివేదికలు ఇచ్చినా చర్యలు లేవు. ఏడాది గడిచినా ఒక్క నాయకుడిని అరెస్టు చేయలేదు." అని బండి సంజయ్ అన్నారు.



## అభిమానుల్లో రిటైర్మెంట్ చర్చలు!

టీ20, టెస్ట్ ఫార్మాట్ల నుంచి రిటైర్ అయిన తర్వాత విరాట్ కోహ్లీ క్రికెట్‌కు కొంత దూరంగా ఉన్నాడు. చివరిసారి ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడినప్పుడు అభిమానులు మైదానంలో చూశారు. అయితే తాజాగా లండన్‌లో ఒక అభిమానితో దిగిన ఆయన ఫోటో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. స్వెట్‌షర్ట్, నల్ల టోపీ ధరించి పోజ్ ఇస్తున్న కోహ్లీ కొత్త లుక్ అందరి దృష్టిని ఆకర్షించింది. ముఖ్యంగా తెల్లటి గడ్డం తో కనిపించడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ ఫోటో చూసి, "ఇప్పుడే అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పబోతున్నారా?" అనే చర్చలు మొదలయ్యాయి. ఈ ఫోటో చూసిన అభిమానులు భావోద్వేగానికి గురయ్యారు. "తెల్ల గడ్డం, కళ్లలో తగ్గుతున్న జ్వాల%ౌ% ఇదే మన ప్రస్తుత విరాట్ కోహ్లీ. మనం చూడాలని అనుకోని ముగింపు దగ్గరపడుతోంది!" అని ఒక అభిమాని రాశాడు. మరో అభిమాని వ్యాఖ్యానిస్తూ, "కోహ్లీని మళ్లీ వైట్స్‌లో చూడాలని ఆశించాం%ౌ% కానీ ఆయన గడ్డమే వైట్ అవుతోంది" అని పేర్కొన్నాడు.

**త్వరలోనే మళ్లీ మైదానంలో?**

గతేడాది టీ20 వరల్డ్ కప్ గెలిచిన తర్వాత కోహ్లీ, రోహిత్ శర్మ చిన్న ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పారు. అలాగే ఇంగ్లాండ్ సిరీస్‌కు ముందే టెస్ట్ క్రికెట్ నుంచి కూడా రిటైర్ అయ్యారు. ప్రస్తుతం వీరిద్దరూ %ాణ×% జట్టులో మాత్రమే ఉన్నారు. అక్టోబర్-నవంబరులో జరిగే ఆస్ట్రేలియా సిరీస్‌లో మళ్లీ యాక్షన్‌లో కనిపించే అవకాశముంది.

# పెంకితనం పోగొట్టాలంటే..



పిల్లలు ఒక్కోసారి చాలా మొండిగా వ్యవహరిస్తుంటారు. తాము అనుకున్నట్లే జరగాలని పట్టుబడతారు. తమకు నచ్చినట్లు జరగకపోతే తల్లిదండ్రులనే కాదు.. ఎవరినైనా లెక్కచేయరు. ఒక్కోసారి అనకూడని మాటలు కూడా అనేస్తుంటారు. ఇంకాస్త రెచ్చిపోయి అక్కడ ఏ వస్తువుంటే అది.. ఒకవేళ చేతిలో ఉన్నదైనా.. అది ఎంత విలువైనదైనా.. ఏమాత్రం ఆలోచించకుండా విసిరి కొడతారు. ఇంకొందరు తల్లిదండ్రులపై దాడి చేస్తారు. ఇలాంటి పిల్లల ప్రవర్తనతో ఒక్కోసారి తల్లిదండ్రులూ ఓర్పు వహించలేక రెండు తగిలిస్తారు. అయితే ఇలా చేస్తే వారిలో మార్పు రాకపోగా, వారి ప్రవర్తన మరింత దిగజారుతుందనేది నిపుణుల హెచ్చరిక. వారి వైఖరిలో మార్పు తేవడానికి ఏవిధంగా వ్యవహరించాలో నిపుణులు కొన్ని సూచనలు చేస్తున్నారు. పిల్లలు జాలి, దయ, కరుణ, ఎదుటివారి పట్ల సానుభూతి, తోటివారి పట్ల సహానుభూతితో వ్యవహరించకపోతే.. వాటి గురించి చెప్పి, నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. వీటన్నింటికన్నా ముందు స్నేహంగా, ప్రేమగా మెలగడం, ఆప్యాయంగా పలకరించడం, అనురాగం కలిగి ఉండడం ఎంత అవసరమో వివరించాలి. అసలు చెప్పకుండా ఇవన్నీ వారి నుంచి ఆశించడం అత్యాశే అవుతుంది.

**కారణాలు గుర్తించాలి..:** పిల్లలు ఇలా పెంకిగా వ్యవహరించడానికి అసలు కారణాలు ఏమిటో తెలుసుకోవాలి. ఒక్కోసారి పిల్లలు వారిలోని బాధల్ని సరిగా వ్యక్తపరచలేకపోవడమే ప్రధానకారణం అంటున్నారు నిపుణులు. వారికి కలిగే బాధ, కష్టం తల్లిదండ్రులకు వ్యక్తపరచలేనప్పుడే పిల్లలు ఇలా మొండిగా వ్యవహరిస్తారని అంటున్నారు. అలాంటి సందర్భాల్లో తల్లిదండ్రుల బాధ్యత మరింత ఎక్కువగా ఉంటుంది. పిల్లల బాధ ఏమిటో తల్లిదండ్రులే తరచి చూడాలి. ఇంకా చెప్పాలంటే తల్లిదండ్రులు కారణం ఏమిటో పరిశోధించాలి. అప్పుడే వాళ్లు ఏం చెప్పదలచుకున్నారో అర్థంచేసుకోవడానికి తల్లిదండ్రులే ప్రయత్నించాలని చెప్తున్నారు నిపుణులు.

**సభ్యమైన పదజాలం వాడేలా..:** పిల్లలు ఏదైనా కొత్త పదం వినగానే పదే పదే అదే రిపీట్ చేస్తుంటారు. అందుకే పిల్లల ముందు పెద్దలు జాగ్రత్తగా ఉండాలి. అదే సందర్భంలో పిల్లలు తోబుట్టువులతో, తల్లిదండ్రులతో, బయటివారితో, పెద్దలతో, తోటి స్నేహితులతో, బంధువులతో ఎవరితో ఎలా మాట్లాడాలో చెప్పాలి. ఎలాంటి పదజాలం ఉపయోగించాలి అనేది నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే అంటున్నారు నిపుణులు. మాట్లాడే విధానంతోనే తన పట్ల ఎలాంటి గౌరవం ఏర్పడుతుందో, తనకు నెరవేరాల్సినవి ఎలా వనగూడతాయో తెలియజెప్పాలి. ఇవన్నీ వారి భావోద్వేగాలనుమెరుగైనపద్ధతిలో వ్యక్తిక రించడానికి తోడ్పడుతుంది. అంతేకాదు తమని తాము తీర్చిదిద్దు కోవడానికి, ప్రవర్తనపరమైన లోపాలు సరిజేసేందుకు ఉపయోగపడు తుంది. జాలి, దయ వంటి సుగుణాలు కూడా అలవడు తాయని చెప్తున్నారు నిపుణులు. కమ్యూనికేషన్ స్కిల్స్ కూడా పిల్లల్లో మెరుగుప డతాయి. దీనివల్ల వారి భవిష్యత్తుకు మెరుగైన మార్గం ఏర్పడినట్లే. మంచి పదాలను నేర్పించడం వల్ల, వాళ్లు వాటిని ప్రాక్టీస్ చేయడం వల్ల వారి పట్ల వారికే నమ్మకం కలుగుతుందని అంటున్నారు.


**ప్రశంసించాలి..:** పిల్లలు తమ ప్రవర్తనను మార్చుకుంటున్నప్పుడు చిన్న అభినందన కొండంత ప్రోత్సాహాన్ని ఇస్తుంది. ఇలా చేయడం వల్ల వారిని మరింత బలంగా మార్పు వైపు ప్రోత్సహించినట్లే అంటున్నారు నిపుణులు. పిల్లలకు ప్రశంస అనేది బూస్టు లాంటిది. పిల్లలు తల్లిదండ్రులు ప్రోత్సహించాలనే ఎక్కువగా కోరుకుంటారు. అందుకే ఎలాంటి పనులు చేస్తే మీ నుంచి అభినందనలు వస్తాయో పిల్లలకు అర్థమయ్యేలా చెప్పాలి. దానివల్ల వారు అలాగే నడుచుకుంటూ తల్లిదండ్రుల నుంచి బోలెడు అభినందనలు పొందుతారు. పిల్లల్ని ప్రోత్సహించి, మంచి ప్రవర్తన కలవారిగా తయారుచేయండి అంటున్నారు నిపుణులు. దీనివల్ల పిల్లల్లో మొండితనం అనేదే కనపడదని చెప్తున్నారు.



## రాణించిన ముంబై బ్యాటర్లు

ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు నమోదు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేపట్టిన ముంబై ఇండియన్స్.. ఢిల్లీ బౌలింగ్ అటాక్ కు ధీటుగా సమాదానమిస్తూ బౌండరీలు బాదింది. తిలక్ వర్మ (33 బంతుల్లో 59) అర్థ శతకంతో చెలరేగాడు. తిలక్ వర్మతోపాటు ఓపెనర్ ర్యాన్ రికల్టన్ (25 బంతుల్లో 41), సూర్య కుమార్ యాదవ్ (28 బంతుల్లో 40), నమన్ ధీర్ (17 బంతుల్లో 38 నాటౌట్) రాణించారు. దీంతో ముంబై ఇండియన్స్ జట్టు ఢిల్లీపై ఐదు వికెట్ల నష్టానికి 205 పరుగుల భారీ స్కోర్ నమోదు చేయగలిగింది. ఇక ఢిల్లీ బౌలర్లలో విప్రాజ్ నిగ్గం, కుల్దీప్ యాదవ్ రెండేసి వికెట్లు తీయగా..ముకేష్ కుమార్ ఒక వికెట్ పడగొట్టాడు. దీంతో ఢిల్లీ క్యాపిటల్స్ 206 పరుగుల విజయలక్ష్యంతో ఛేజింగ్ ప్రారంభించనుంది.

# చెమటకాయలు పోవాలంటే..



ప్రతి ఒక్కరూ ఎదుర్కొనే అతి ముఖ్యమైన సమస్యల్లో చెమటకాయలు ఒకటి. వీటి కారణంగా చర్మం దురద పెట్టటమే కాకుండా మృదుత్వాన్నికోల్పోతుంది. కొన్ని సహజసిద్ధమైన చిట్కాలను పాటిస్తే చాలా సులభంగా చెమటకాయల నుంచి బయట పడొచ్చు.

పెరుగు : చెమట కాయలు ఉన్న ప్రదేశంలో చల్లని పెరుగుని అప్లై చేసి 15 నిమిషాలు ఉంచాలి. తరువాత చల్లని నీటితో కడిగేసి మెత్తటి బట్టతో అద్దాలి. పెరుగులో సహజంగాఉండేయాంటీ బ్యాక్టీరియల్,యాంటీ ఫంగల్ ప్రాపర్టీస్ చెమటకాయలు రాకుండా చేస్తాయి.

రోజ్ వాటర్ : 200 ఎంఎల్ రోజ్ వాటర్‌లో నాలుగు టేబుల్ స్పూన్ల తేనె, 200 ఎంఎల్ ప్యూర్ వాటర్ కలపాలి. బాగా కలిపి ఐస్ ట్రేలో పోసి ఫ్రీజ్ చేయాలి. ఇవి క్యూబ్స్‌లా అయ్యాక నాలుగైదు క్యూబ్స్ తీసుకుని పల్చని మస్లిన్ బట్టలో చుట్టి చెమట కాయలు ఉన్న ప్రదేశంలో మృదువుగా అద్దాలి. రోజ్ వాటర్ చర్మం పీహెచ్ బ్యాలెన్స్‌ని మెయింటెయిన్ చేస్తుంది. ఎక్కువగా ప్రొడ్యూస్ అయ్యే ఆయిల్‌ని కంట్రోల్ చేస్తుంది.

గంధం : గంధానికి చల్లని ఫుల్ ఫ్యాట్ మిల్క్ కలిపి ఆ మిశ్రమాన్ని చెమట కాయలు ఉన్న ప్రదేశంలో పట్టించి గాలికి ఆరనివ్వాలి. ఆ తరువాత చల్లని నీటితో కడిగేయాలి.

ముల్తానీ మిట్టి : మూడు టేబుల్ స్పూన్ల ముల్తానీ మిట్టిలో రెండు టీ స్పూన్ల పుదీనా పేస్ట్ కలిపి తగినన్ని చల్లని పాలు పోసి స్మూత్ పేస్ట్ తయారు చేయాలి. ఈ మిశ్రమాన్ని చర్మం మీద అప్లై చేసి గాలికి ఆరనివ్వాలి. ఆ తరువాత చల్లని నీటితో కడిగేయాలి.

కలబంద : చెమటకాయలు ఉన్న ప్రదేశంలో కొంచెం కలబంద గుజ్జు రాస్తే త్వరగా తగ్గిపోతాయి. కలబందలో ఆస్ట్రిజెంట్ లక్షణాలు ఉండటం వలన చెమటకాయలు త్వరగా తగ్గటానికి సహాయపడతాయి. చర్మంపై ఉండే ఇన్‌ఫెక్షన్లను కూడా తగ్గిస్తుంది.

టీ ట్రీ ఆయిల్ : టీ ట్రీ ఆయిల్‌లో యాంటీ బాక్టీరియల్, యాంటీ వైరల్ లక్షణాలు సమృద్ధిగా ఉంటాయి .కొంచెం టీ ట్రీ ఆయిల్‌ను తీసుకుని దానికి కొంచెం నీటిని కలిపి మిశ్రమంగా తయారు చేయాలి. ఆ మిశ్రమంలో కాటన్ బాల్‌ను ముంచి చర్మంపై రాస్తే చెమట కాయలు చాలా త్వరగా తగ్గిపోతాయి.

వెనిగర్ : టిష్యూ పేపర్‌ను తీసుకుని వెనిగర్‌లో ముంచి చెమట కాయలు ఉన్న ప్రదేశంలో అద్దాలి. ఇలా చేస్తే చెమట కాయలు త్వరగా తగ్గిపోతాయి.

లవంగ నూనె : కాటన్ బాల్‌ను తీసుకుని లవంగ నూనెలో ముంచి చెమటకాయలు ఉన్న ప్రదేశంలో రాస్తే చెమట కాయలు తగ్గుముఖం పడతాయి. తరచూ ఇలా చేయడం వల్ల మంచి ఫలితం కనిపిస్తుంది.

# హైడ్రేటెడ్‌గా ఉంటేనే.. అందం!



వేసవి వేడి.. మీ చర్మం తేమను కోల్పోయేలా చేస్తుంది. చర్మం పొడిబారి.. అందం బీటలు వారుతుంది. అంతేకాదు.. సూర్యుడి హానికరమైన యూవీ కిరణాలు.. చర్మంలో మెలనిన్ ఉత్పత్తిని ప్రేరేపిస్తాయి. తద్వారా చర్మం రంగు మారడంతోపాటు ముఖంపై నల్ల మచ్చలూ ఇబ్బంది పెడుతాయి. వీటినుంచి బయట పడాలంటే.. ఈ జాగ్రత్తలు తీసుకోవాల్సిందే!

చర్మాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడానికి పుష్కలంగా నీరు తాగాలి. రోజుకు కనీసం 8-10 గ్లాసులైనా తీసుకోవాలి. దీనివల్ల శరీరం నుంచి టాక్సిన్స్ బయటికి వెళ్లిపోతాయి. చర్మం లోపలి నుంచి హైడ్రేటెడ్‌గా మారుతుంది. నీటిశాతం అధికంగా ఉండే దోసకాయలు, పుచ్చకాయ, నారింజ, స్ట్రాబెర్రీలను ఎక్కువగా తీసుకోండి. ఇవి శరీరాన్ని హైడ్రేట్ చేయడమే కాకుండా.. చర్మానికి అవసరమైన పోషకాలను కూడా అందిస్తాయి. ఆహారంలో యాంటి ఆక్సిడెంట్స్, విటమిన్ సి ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఇవి యూవీ కిరణాల నుంచి చర్మానికి రక్షణ కల్పిస్తాయి. విటమిన్ సి.. శరీరంలో ఫ్రీరాడికల్స్‌తోపాటు మెలనిన్ ఉత్పత్తిని నిరోధిస్తుంది. నల్లమచ్చలు రాకుండా కాపాడుతుంది. ఇక ఎక్కువ సమయంపాటు ఏసీ గదుల్లో ఉన్నా.. చర్మం పొడిబారుతుంది. ఏసీల నుంచి వచ్చే పొడిగాలి.. చర్మంలో తేమను తొలగిస్తుంది. కాబట్టి, ఇంట్లో, కార్యాలయాల్లో హ్యూమిడిఫయర్స్‌ను ఏర్పాటు చేసుకోవాలి. ఇవి గాలికి తేమను అందించి.. చర్మం ఎక్కువ పొడిగా మారకుండా నిరోధిస్తాయి.చర్మ సంరక్షణ కోసం కలబంద వంటి హైడ్రేటింగ్ పదార్థాలను కలిగిన మాయిశ్చరైజర్లు వాడాలి. ఇవి చర్మం తేమను కోల్పోకుండా కాపాడతాయి. చర్మాన్ని మృదువుగా మార్చడంలో సహాయపడతాయి.వేసవిలోనే కాదు.. ఏడాదంతా సన్‌స్క్రీన్ లోషన్ వాడటం మంచిది. ఇది హైపర్‌పిగ్మెంటేషన్‌కు వ్యతిరేకంగా పనిచేస్తుంది. రసాయనాలు తక్కువగా ఉండే ఉత్పత్తులను ఎంచుకోండి. ఇక వేసవిలో ప్రతి రెండుమూడు గంటలకు ఒకసారి సన్‌స్క్రీన్ లోషన్‌ను అప్లయి చేస్తూ ఉండాలి.

# సినిమా..

## అఖండ 2 సస్పెన్స్ తీరేది ఎప్పుడు..?



నందమూరి బాలకృష్ణ బోయపాటి శ్రీను కాంబినేషన్ లో వస్తున్న అఖండ 2 సినిమా అసలైతే సెప్టెంబర్ 25న రిలీజ్ లాక్ చేసుకున్నారు. టీజర్ తోనే సినిమాపై హ్యూజ్ బజ్ ఏర్పడేలా చేశారు మేకర్స్. సినిమాలో బాలయ్య మాస్ విధ్వంసంతో రికార్డులచెడుగుడు ఆడేస్తాడని అంటున్నారు. సం యుక్త మీనన్, ప్రగ్యా జైశ్వాల్ హీరోయిన్స్ గా నటిస్తున్న అఖండ 2 కి మరోసారి థమన్ తన మాస్ డ్యూటీ చేస్తున్నాడట. అఖండ 2 సినిమాను దసరాకి రిలీజ్ ఫిక్స్ అనుకున్నారు. కానీ సినిమా పాన్ ఇండియా వైడ్ రిలీజ్ చేసే క్రమంలో వి.ఎఫ్.ఎక్స్ వర్క్ ఇంకాస్త బాగా చేయాలని ఆలోచిస్తున్నారట. అందుకే హర్రి బర్రి అన్నట్టు కాకుండా సినిమాను అనుకున్న విధంగా అవుట్ పుట్ వచ్చే వరకు చేయాలని చూస్తున్నారు. ఈ క్రమంలో అనుకున్న సెప్టెంబర్ 25 రిలీజ్ డేట్ కూడా మారే అవకాశాలు ఉన్నాయట. ఐతే అఫీషియల్ గా చిత్ర యూనిట్ ఆ విషయాన్ని అనౌన్స్ చేయలేదు. ఐతే దసరా కి అదే సెప్టెంబర్ 25కి ఆల్రెడీ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఓజీ సినిమా రిలీజ్ ఫిక్స్ చేశారు. ఓజీ సినిమాను సుజిత్ డైరెక్ట్ చేస్తున్నాడు. దానయ్య డివివి భారీ బడ్జెట్ తో ఈ సినిమా చేస్తున్నారు. ఈ సినిమా కోసం పవర్ స్టార్ ఫ్యాన్స్ ఎంతగానో ఎదురు చూస్తున్నారు. రీసెంట్ గా జరిగిన వీరమల్లు ఈవెంట్ లో కూడా ఓజీఓజీ అనే కేకలు వేశారు. అఖండ2 వస్తుందో లేదోఅన్నది తెలియ దు కానీ ఓజీ మాత్రం తప్పనిసరిగా సెప్టెంబర్ 25 వచ్చి తీరుతుంది. అఖండ 2 రిలీజ్ డేట్ పై కన్ ఫ్యూజన్ ఇంకా కొనసాగుతూనే ఉంది. బోయపాటి శ్రీను ఈ సినిమా మీద స్పెషల్ ఫోకస్ తో పనిచేస్తు న్నారని తెలుస్తుంది.

రిలీజ్ డేట్ముఖ్యం కాదుసినిమా ఆడియన్స్ ని అలరించేలా చేయడం ముఖ్యం. అందుకే అఖండ2 రిలీజ్ పై ఇంకా స్పష్టత తీసుకోలేదు. ఒకవేళ అఖండ 2 దసరా రేసు నుంచి తప్పుకుంటే మాత్రం పవర్ స్టార్ ఓజీకి కలిసి వచ్చినట్టే. ఐతే దసరాకి అఖండ 2 మిస్ అయితే తమిళ సినిమాలు ఏవైనా వచ్చే ఛాన్స్ ఉంది.

## అతనికి ఇంప్రెస్ అయిన నయన్..!



కోలీవుడ్ స్టార్ హీరోయిన్ నయనతార ఆఫ్టర్ లాంగ్ టైం తెలుగులో మెగా మూవీకి సైన్ చేసింది. మెగాస్టార్ చిరంజీవి 157 సినిమాలో చిరంజీవి సరసన నటిస్తుంది నయనతార. ఆల్రెడీ ఈ ఇద్దరు సైరా నరసింహారెడ్డి సినిమాలో కలిసి జత కట్టారు. ఆ తర్వాత మళ్లీ అనిల్ రావిపూడి సినిమాకు పనిచేస్తున్నారు. ఐతే పెళ్లి తర్వాత నయనతార చాలా సెలెక్టెడ్ గా సినిమాలు చేస్తుంది. ఇతర భాషల సినిమాలైతే మాక్సిమం కాదనేస్తుంది. కానీ చిరుతో సినిమా అది కూడా అనిల్ డైరెక్షన్ లో అనేసరికి ఆసక్తి చూపించింది. అనిల్ రావిపూడి సినిమా షూటింగ్ ఎంట్రీ తోనే నయనతార ఒక క్రేజీ వీడియోతో హాయ్ చెప్పింది. ఇక సినిమాలో ఆమె రోల్ కూడా క్రేజీగా ఉండబోతుందని తెలుస్తుంది. సినిమాలో చిరంజీవి పి.ఈ.టి మాస్టర్ గా కనిపిస్తాడట. నయన్ పాత్ర గురించి డీటైల్స్ బయటకు రాలేదు. ఐతే అనిల్ వర్కింగ్ స్టైల్ కి నయనతార ఫిదా అయ్యిందని టాక్. ఎందుకంటే అసలేమాత్రం మిస్ యూజ్ లేకుండా స్టార్ డేట్స్ ని వాడుతున్నాడట అనిల్ రావిపూడి. అందుకే నయనతారకి కూడా అతను బాగా నచ్చేశాడట. అనిల్ రావిపూడితో పనిచేసిన ఎవరైనా ఈ మాటే చెబుతారు. నయనతార తెలుగు సినిమా చేయాలనుకోవడమే షాకింగ్ థింగ్ అయితే.. సినిమా అనుకున్న విధంగా చక చకా కానివ్వడం చూసి ఆమె సర్ ప్రైజ్ అవుతుందట. స్టార్స్ ని డేట్స్ అడిగి.. దానికి ఒకటి రెండు రోజులు అదనంగా తీసుకునే డైరెక్టర్స్ ని చూశాం కానీ అనిల్ ఇచ్చిన స్టార్ డేట్స్ కి రెండు రోజుల ముందే షెడ్యూల్ పూర్తి చేస్తాడట. అందుకే అతని గురించి అందరు పాజిటివ్ గా చెప్పుకుంటున్నారు. నయనతార కూడా ఇంప్రెస్ అయ్యింది అంటే ఆమెను మళ్లీ మళ్లీ తన సినిమాల్లో తీసుకునే ఛాన్స్ ఉంటుంది.

## ఎంత హైటున్న హీరో అయినా ఒకే!




టాలీవుడ్ కి పరిచయమైన యంగ్ బ్యూటీ ఇవానా గురించి చెప్పాల్సిన పనిలేదు. తొలి సినిమాతోనే అమ్మడు యువత అటెన్షన్ డ్రా చేసింది. యూత్ ఫుల్ లవ్ స్టోరీ తో కుర్ర కారులో క్రేజీ బ్యూటీగా మారిపోయింది. వైవిధ్యమైన హావభావాలతో ప్రేక్షకులకు దగ్గరైంది. ఇటీవలే సింగిల్ తో తెలుగులోనూ లాంచ్ అయింది. ఈ సినిమా కూడా మంచి విజయం సాధించింది. కేతిక పాత్ర కంటే ఇవానా పాత్రకే మంచి రెస్పాన్స్ వచ్చింది. అలాగే త్రినాధరావు నక్కిన దర్శకత్వంలో ఓ ఛాన్స్ అందు కుందనే ప్రచారం జరుగుతోంది. సక్సెస్ పరంగా ఇవానా ట్రాక్ బాగుంది. కోలీవుడ్ తో పాటు టాలీవుడ్ లోనూ పాజిటివ్ గానే కనిపి స్తుంది. యూత్ లోనూ క్రేజీ బ్యూటీగా వైరల్ అవుతోంది. -సింగిల్- తర్వాత తెలుగులో ఫాలోయింగ్ రెట్టింపు అయింది. ఇక ఇవానా వయసు విషయానికి వస్తే అమ్మడికి 25 ఏళ్లు. అంటే స్టార్ హీరోలందరితో నటించే వయసే. 20 ఏళ్ల నటే 50-40 ఏళ్ల వయసున్న హీరోలతో రొమాన్స్ చేస్తున్నారు. కాబట్టి ఇవానికి వయసు అడ్డండి కాదు.

## వీరమల్లు-2.. సాధ్యమేనా?




సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ నిన్ననే ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది 'హరిహర వీరమల్లు'. కానీ సినిమాకు టాక్ అంత గొప్పగా లేదు. ప్రథమార్ధం వరకు బాగానే అనిపించినా.. తర్వాత సినిమా అంచనాలకు తగ్గట్లు సాగలేదు. సినిమా చివరికి వచ్చేసరికి ప్రేక్షకులను నిరుత్సాహం ఆవహించేసింది. ఏ సినిమాకైనా ప్రథమార్ధం అటు ఇటుగా ఉన్నా.. ద్వితీయార్ధం, ముఖ్యంగా ముగింపు బాగుండడం ఎంతో అవసరం. అప్పుడే ప్రేక్షకులకు మంచి అనుభూతి కలుగుతుంది.సినిమా మీద సానుకూల అభిప్రాయం కలుగుతుంది. కానీ ఈ సినిమా విషయంలో అది జరగలేదు. అందుకే ఎక్కువగా నెగెటివ్ టాక్ స్ప్రెడ్ అవుతోంది. క్లైమాక్స్‌లో ఏదో ఊహించుకుంటే అదంతా పక్కన పెట్టి తుపాను నేపథ్యంలో ఏదో యానిమేషన్ వీడియో చేసినట్లు లాగించేశారు. పతాక సన్నివేశాల్లో ఏం కోరుకున్నామో అదంతా 'హరిహర వీరమల్లు' పార్ట్-2 'యుద్ధభూమిలో చూసుకోమని సెలవిచ్చాడు దర్శకుడు జ్యోతికృష్ణ. ఐతే ప్రస్తుత పరిస్థితుల్లో అసలు 'వీరమల్లు-2' సాధ్యమవుతుందా అన్న సందేహాలు తలెత్తుతున్నాయి. ఎప్పుడైనా సరే.. హిట్ సినిమాలకే సీక్వెల్స్ తయారవుతాయి. రిలీజ్‌కు ముందు, రిలీజ్ టైంలో సీక్వెల్ గురించి ఎంత ఊరించినా.. అంతిమంగా ఫలితాన్ని బట్టే రెండో భాగం తీయగలుగుతారు. తొలి భాగానికి సంతృప్తికర ఫలితం రానపుడు సీక్వెల్ తీయడానికి అడుగు ముందుకు పడదు. ఐతే నిన్నటి ప్రెస్ మీట్లో ఇటు దర్శకుడు జ్యోతికృష్ణ, అటు హీరో పవన్ కళ్యాణ్ 'వీరమల్లు-2' గురించి ప్రస్తావించారు. రెండో భాగానికి సంబంధించి 25-30 శాతం చిత్రీకరణ కూడా పూర్తయినట్లు స్వయంగా పవనే వెల్లడించాడు. ఐతే సీక్వెల్ తీయడం ప్రధానంగా పవన్ చేతుల్లోనే ఉంది. 'వీరమల్లు' పూర్తి చేయడానికి ఆయనెంత ఇబ్బంది పడ్డారో తెలుసు. ప్రస్తుతం చేతిలో ఉన్న సినిమాలను ముగించి, ఇక సినిమాలకు స్వస్తి చెప్పే ఆలోచనతో ఉన్నట్లు ఇప్పటిదాకా పవన్ సంకేతాలిస్తూ వచ్చాడు. అలాంటపుడు వీరమల్లు-2 కోసం ఆయన డేట్లు ఇస్తాడా అన్నది ప్రశ్న. దాని మీద రత్నం డబ్బులు పెట్టడానికి సిద్ధమా అన్నది మరో ప్రశ్న. అన్నింటికీ మించి 'వీరమల్లు' అంతిమంగా మంచి ఫలితం అందుకుంటుందా అనే క్వశ్చనూ ఉంది. అన్నీ కుదిరి నిజంగా 'వీరమల్లు-2' సాధ్యమవుతుందా అన్నది సందేహమే.

## బ్లాక్ డ్రెస్‌లో మీనాక్షి చౌదరి అందాల మాయ



గ్లామరస్ లుక్‌లు ఆమెకు కొత్తకాదు కానీ, ఈసారి మాత్రం మీనాక్షి చౌదరి చూపిన అటిట్యూడ్ చూస్తే ఏవరికైనా వావ్ అనిపించకమానదు. బ్లాక్ షైనీ డ్రెస్‌లో ఆమె చేసిన ఫోటోషూట్ ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. కాస్త బోల్డ్‌గా కనిపించిన మీనాక్షి స్టైలింగ్‌లోని ఫినిషింగ్, హేర్ డూ, మేకప్ అన్నీ కూడా పర్ఫెక్ట్ అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఫ్రెంచ్ మ్యూజిక్‌కి స్టయిలిష్‌గా పోజులిచ్చిన ఈ ఫోటోలు యువతను ఆకర్షిస్తున్నాయి. మెడ దగ్గర నుండి స్లీవ్‌కు లూప్ లా డిజైన్ చేసిన డ్రెస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రత్యేకంగా చెప్పాల్సిన విషయం ఏంటంటే, ఆమె కళ్ల లుక్స్. కెమెరాకి ఆమె ఇచ్చిన లుక్స్‌లో కనిపించిన కాన్ఫిడెన్స్, ఫెమినిన్ గ్రేస్ అన్నీ కలిసి ఫోటోషూట్‌ను లెవెల్ మీదకు తీసుకెళ్లాయి. అందుకే ఈ ఫోటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. సినీ సెలబ్రిటీలు కూడా కామెంట్స్ చేస్తూ మీనాక్షికి ఫుల్ మార్కులు వేస్తున్నారు. కేవలం ఫోటోలు మాత్రమే కాదు, మీనాక్షి చౌదరి కెరీర్ కూడా ఇంప్రెసివ్‌గా కొనసాగుతోంది. మిస్ ఇండియా రన్నరప్‌గా గుర్తింపు పొందిన ఆమె, తన సినీ ప్రస్థానాన్ని 'ఇచట వాహనములు నిలుపరాదు' అనే చిత్రంతో ప్రారంభించారు. ఆ తరువాత 'ఖిలాడి', 'హిట్ 2', 'గుంటూరు కారం' వంటి సినిమాల్లో గ్లామరస్ పాత్రలతో ఆకట్టుకున్నారు. ఆమెకి త్వరలో విడుదల కాబోయే సినిమాలు కూడా ఓ కీలకమైన మైలురాయిగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## మిరాయ్ నుండి వైబ్ ఉంది బేబి.. సాంగ్ విడుదల..



'హనుమాన్'తో భారీ విజయాన్ని అందుకున్న తేజ సజ్జా ఇప్పుడు పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతోన్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'మిరాయ్' ద్వారా మళ్లీ ప్రేక్షకులను మెస్మరైజ్ చేయడానికి సిద్ధమవుతున్నారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రితికా నాయక్ కథానాయికగా నటిస్తున్నారు. మరో విశేషం ఏంటంటే .. మంచు మనోజ్ ఇందులో ప్రతినాయకుడిగా ధీటైన పాత్రలో కనిపించనున్నారు. శ్రియ, జయరామ్, జగపతిబాబు వంటి నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టి.జి. విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్‌లో థియేటర్లలో విడుదల కానుంది.

ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను పెంచగా, తాజాగా విడుదలైన ఫస్ట్ సాంగ్ ప్రోమో సినిమాకు మరింత హైప్ క్రియేట్ చేసింది. "వైబ్ ఉందిలే బేబీ వైబ్ ఉందిలే ఈ గ్లోబ్‌ను ఊపే వైబ్ ఉందిలే" అంటూ సాగే పాట ఫుల్ ఎనర్జీతో, స్టైలిష్ విజువల్స్‌తో ఆకట్టుకుంటోంది. తేజ సజ్జా - రితికా జంటపై ఈ పాటను పోలంకి విజయ్ నృత్య దర్శకత్వంలో చిత్రీకరించారు. పాటకు కృష్ణకాంత్ మాస్టర్‌ఫుల్ లిరిక్స్ అందించగా, మ్యూజిక్ డైరెక్టర్ గౌర హరి తమ మ్యూజిక్ మ్యాజిక్‌ను మళ్లీ చూపించారు. పాటను ఫేమస్ బాలీవుడ్ సింగర్ అర్మాన్ మాలిక్ ఆలపించడంతో, ఈ సాంగ్‌కు పాన్ ఇండియా వైబ్ వచ్చేసింది. ప్రస్తుతం ఈ పాట నెటిజన్స్‌ని ఎంతగానో ఆకట్టుకుంటుంది. పాటకి మంచి రెస్పాన్స్ వస్తుంది. మిరాయ్ సినిమాతో తేజ సజ్జా మరోసారి సూపర్ హీరో ఫీల్ కలిగించే కాన్సెప్టుతో ప్రేక్షకుల ముందుకు రానున్నారని టాలీవుడ్ వర్గాలు చెప్పుకుంటున్నాయి. గ్లోబల్ స్కేల్‌లో తెరకెక్కుతున్న ఈ మూవీ నుంచి వచ్చే ప్రతి అప్డేట్‌కి అభిమానులు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారు. వైవిధ్యమైన కాన్సెప్ట్‌లతో ప్రేక్షకులని అలరిస్తున్న తేజ సజ్జా ఈ చిత్రంతోను మంచి హిట్ కొడతాడని అంటున్నారు.

Edited, Published & Owned by KACHAM SATYANARAYANA. Printed at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS, #3-63, THANEDHARPALLE, GHANPUR STATION MANDAL, THANEDHARPALLE, WARANGAL, TELANGANA - 506143. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | RNI No: TGTEL/25/A1676, Email: vishwambhara.daily@gmail.com